# జ్ఞాతవ్యము

## (నాల్గవ భాగము)

గ్రంథకర్త:

**యం. దేవదాసు అయ్యగారు**

గుంటూరు - 2006

వెల: రూ/- 15.00

Bible Mission HQ Guntur

# ఆనంద దేశము

## యెరూషలేము

**"అది (ఆనందదేశము) దక్షిణముగాను, తూర్పుగాను, ఆనందదేశపు దిక్కుగాను, అత్యధికముగా బలిసెను." దానియేలు 8:9.**

యెరూషలేము సర్వభూమికి ఆనందదేశము. కీర్తన. 48:2
వారు "రమ్యమైన" దేశమును నిరాకరించిరి. కీర్తన. 106:24

నిత్యానంద దేశమునకు ప్రయాణము చేయగోరు విశ్వాసులకు దేవవాక్యము ననుసరించి చెప్పవలసిన పాఠము మోక్షానంద దేశమునకు వెళ్ళవలెనను కోరికగల వారికి చెప్పవలసిన ఉపదేశము: ఆనందదేశము ఎక్కడ నున్నది? ఎందుకు దానికాపేరు కలిగెను? వేటినిబట్టి మనము తీర్మానము చేసికొనవచ్చును? దానియేలు బబులోను దేశమున ఖైదుగానున్నప్పుడు కఠినమైన దర్శనము కలిగెను. అది రెండవ మనిషి విప్పలేడు. దాని వివరము చెప్పుటకు దానియేలే రావలెను. (దాని. 8:9). దర్శనములో చివర ఒక మేకపోతు కొమ్ములలోనుండి చిన్నకొమ్ములేచి "ఆనందదేశపు" తట్టు వ్యాపించినట్లు గలదు అప్పటికి ఆనంద దేశమనగా అర్ధముకాదు. బైబిలు పండితులు ఆలోచింపగా అన్నిదేశములు ప్రపంచ పటములోనున్నవి గాని ఆనందదేశము ఎక్కడనులేదు అనుకొనిరి. గనుక బైబిలులోనున్న (యెరూషలేము అను) ఆనందదేశమునుబట్టి పరిశీలన చేసిరి. ఒకప్పుడు విదేశీ వర్తకులకుకూడ తెలియదు 'ఇండియా' దేశమున్నట్లు, అదేవిధంగా ఆనందదేశము కూడ ఉన్నదని గుర్తించి, జ్ఞాపకముంచుకొనవలెను.

కీర్తన. 106:24లో రమ్యమైన దేశమని గలదు, రెండు ఒకటే. ఇంకా చాలపేర్లు దీనికి గలవు. ఆ దేశమునందు ఒక పట్టణమున్నది అందు పర్వతమున్నది. ఈ పట్టణమును పరిశీలించి మీరు మీ తరమువారికి చెప్పవలెనని కీర్తన 48:12లో గలదు. అందుచేత బోధకులు ఈ దేశమునుగూర్చి చెప్పుట అవసరమే ఈ ఆనంద దేశమునకు అనేకపేర్లు గలవు. (1) రమ్యమైన దేశము (2) వాగ్దానదేశము (3) పాలెస్తీనా (4) పాలుతేనెలు ప్రవహించు దేశము (5) పరిశుద్ధభూమి (6) రక్షకుని జన్మభూమి (7) ఇశ్రాయేలీయుల దేశము మొదలగునవి దీనికి మారుపేర్లు.

**ఆనందదేశము:-** ఈ దేశమునకు తూర్పున యొర్దాను నది కలదు. మధ్యన యెరూషలేమున్నది. అది దేవుని పరిశుద్ధ పట్టణము. అందు ప్రసిద్ధి కెక్కిన దేవాలయమున్నది. ఇది సర్వభూమికి ఆనందకరమైయున్నది (కీర్తన 48:2). పట్టణము, పర్వతము, దేవాలయము- ఇవన్ని ఆనందకరమైనవి. దేవుడు సర్వభూమికి దీనిని ఆనందకరముగా నియమించెను. క్రైస్తవులకు మాత్రమేకాదు సమస్తమైన వారికి ఆనందకరమైనది. క్రీస్తుప్రభువు 'సర్వలోకమునకు, సర్వసృష్టికి భూదిగంతముల వరకు సువార్త ప్రకటించుడి' అనెను. సర్వ దేశములవారు దీనినిగూర్చి నేర్చుకొనవలెను. ప్రభువు ఇచ్చట పుట్టి, పెరిగి, సంచరించి, అలసట తీర్చుకొని, అద్భుతములుచేసి, సిలువ మరణముపొంది తిరిగిలేచెను గనుక ఇది ఆనందదేశము. దేవుడు తన ప్రజలనుచూచి 'ఈ దేశమును మీకు ఇస్తానని' చెప్పెను. అందుచేత వాగ్ధాన దేశమని పేరు. ఇది దేవుని నోటనుండి

బయలుదేరినమాట. (1) మీకు (2) ఇస్తాను అనెను. భక్తులు అదే పట్టుకొనిరి. ఆ దేశము దేవుడు వారికి ఇచ్చునని నిరీక్షించిరి. 'ఇస్తానన్నాడు' గనుక ఆశ అది మా దేశమే అని సంతోషించేవారు ఆ సంతోషము వారి హృదయములలో నుండెను. గనుక ఆనంద దేశమనే పేరు దానికి సరియైనదే. దేవుడు అబ్రాహాము కాలమందు (ఆది. 15:21)లో అబ్రాహామునకు వాగ్దానము చేసెను. "ఇచ్చెదను" అని ఉండవలెను గాని "ఇచ్చియున్నాను" అని దేవుడు చెప్పెను. ద్వితియోపదేశ కాండములో కూడ దానిని స్వాధీనపరచుకొనండి ఎందుకనగా దానిని మీకిచ్చియున్నానని చెప్పెను. మన భాష ఇస్తానని, గాని, దేవునిభాష "ఇచ్చియున్నాను" అనునది ఇస్తానంటేనే ఆనందము ఇచ్చినాను అన్న మరీ ఆనందము. గనుక 'ఆనంద దేశమను' పేరు తగినదే. **1.పాలస్తీనా దేశము:-** మీరు ఆ దేశమును ఆక్రమించుకొనవలెనని దేవుడు ఇశ్రాయేలీయులతో చెప్పెను. అప్పటికి దేవుని నెరుగని విగ్రహారాధికులు అక్కడ ఉన్నారు. ఇప్పుడు నా (దేవుని) జనులకు కావలెను గనుక వారిని వెళ్ళగొట్టవలెను. ఆ దేశము ఖాళీచేసి మీరు ఆక్రమించుడి అని చెప్పుట వారికి ఆనందకరమైన వృత్తాంతము. గనుక అది ఆనందదేశమే. **2. పాలుతేనెలు ప్రవహించు దేశము:-** ఆ దేశము సమృద్ధిగల దేశము (1) పాలు ప్రవహించు దేశము (2) తేనె ప్రవహించు దేశము. గనుక సమృద్ధి. పాలు ప్రవహించుట ఎప్పుడు చూడక పోవచ్చును. తేనె ప్రవహించుట కొద్దిగా చూడగలము ఆ దేశములో పశువులు, గడ్డి, వర్షము, జలము ఎక్కువ గనుక పాడి ఎక్కువ గనుక ప్రవహించుట లెక్కగట్టిరి. ఎక్కడచూచిన తేనె గలదు. ప్రయాణీకులు తినవచ్చును. దేవుడు వాటితో ఆ దేశమును నింపెను. గనుక ఆనంద దేశము మరియు

ఈ దేశములో లోహములున్నవి. గనుక 1914 సం॥ము యుద్ధము దీనికికూడ సంబంధించియున్నది. ఈ దేశము అందుగల మృత సముద్రము బాగగునని ప్రవచనము గలదు. అది బాగుపడుటకు వినియోగించు ఖనిజములు అనేకములుండుటవలన చాల ఉపయోగకరముగా నున్నది. గనుక ఇది ఆనందదేశము.

**5. పరిశుద్ధభూమి:-** ఇవన్నియు శరీర జీవనమునకు మేళ్ళు మరియు ఆత్మీయ జీవితమునకు మేళ్ళు గలవు గనుక అది ఆనందదేశము, ఇవి శరీర జీవితమునకు మేళ్ళు. ఇది ఒక వరుస. మరియొక వరుస ఆత్మీయ మేళ్ళు ఏమితిందుమో అని చింతింపవద్దు అని ప్రభువు చెప్పినమాట గలదు. పాతనిబంధనలో తండ్రి శరీర సదుపాయములు చేసెను. ప్రభువుకూడ అదేకొండ ప్రసంగములో చెప్పెను. దేవుని రాజ్యము వెదకిన అన్నీ దొరుకునని చెప్పెను. ఇన్ని అనుభవించుచు ఆయనను స్తుతించవలెనని కోరెను. విందు అయిన తర్వాత ఇంకా ఏమైన ఉండునని ఆశించినట్లు, ఆత్మీయ మేళ్ళుకూడ ఇచ్చెదనని ఇశ్రాయేలీయులను ఆశపెట్టెను.

# ఆనందదేశము - 2

## (ఆత్మీయ చరిత్ర)

**ఇందులోని ఆత్మీయభాగము:-** ప్రియులారా! మనము బైబిలు చదువునప్పుడు నాలుగు సంగతులు జ్ఞాపకముంచుకొనవలెను. (1) పాత నిబంధన (2) క్రొత్త నిబంధన (3) సంఘ నిబంధన (4) మోక్షలోక నిబంధన- పాత నిబంధనలోని వాటికి క్రొత్త నిబంధనలో నెరవేర్పులుండును. పాత నిబంధనలో గుర్తులు సూచనలు గలవు. వాటి నిజరూపములు క్రొత్త నిబంధనలో కలవు. క్రొత్త

నిబంధనలోనున్న నెరవేర్పులు క్రైస్తవ సంఘములో అమలులోనికి తీసుకురావలెను (వాడుకలోనికి తీసికొనివచ్చుట). అనగా ఇక్కడ నేర్చుకొన్నవి మోక్షలోకములోనే పూర్తి అయి ముగింపు అగును.

ఆనంద దేశముయొక్క ఆత్మీయ చరిత్ర చాలా ముఖ్యము, చాలా పెద్దది, దానికి ముగింపులేదు. పాత నిబంధనలో కొన్ని సంగతులెత్తుకొని ఈ భాగములు వివరింతును. అది 4 భాగములు (1) అబ్రాహాము చరిత్ర (2) యెహోషువ చరిత్ర (3) రాజుల చరిత్ర (4) ప్రవక్తల చరిత్ర. ఈ నాలుగు సంగతులు ఆత్మీయ చరిత్రగా ఏర్పడును. ఆ దేశము పితామహుల దేశము. అబ్రాహాము చరిత్రలోని ఆత్మీయ చరిత్ర కావలెను.

**(1) అబ్రాహాము చరిత్ర:-** "భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును." ఆది. 12:3 అని దేవుడు అబ్రాహాముతో చెప్పెను. భూమియావత్తు ఈ దీవెనలో గలదు. అన్ని వంశములు గలవు. ఇది మహాగొప్ప ఆశీర్వచనము. ఇదే ఆత్మీయ చరిత్ర. సువార్తలలో యేసుప్రభువు సృష్టి అంతటికి సువార్త చెప్పండి అనెను. దేవుడు అబ్రాహాముతో చెప్పినదే యేసుప్రభువుకూడ చెప్పెను. ఇదే రక్షణ సువార్త. ఈ రక్షణ వార్తను మొదట అబ్రాహామునకు దేవుడు తెలియపర్చెను. గనుక దాని మహిమ అందరికి వ్యాపింపవలెను. వంశములన్నిటికి రక్షణ సర్వజనులకు రక్షణసిద్ధమైయున్నది. అది దొరకకపోవుట మానవుని యొక్క లోటు. పాలెస్తీన పితామహుల దేశము. వీరు యూదులకు మనకుకూడా పితామహులే. వీరివలన లోకమంతటికిని దీవెన. మన పెద్దల దేశము గనుక. వారి దీవెనలో మన రక్షణ గలదు గనుక మనకు సంతోషము, గనుక ఇది ఆనందదేశమే.

***(2) యెహోషువ చరిత్ర:-*** యెహోషువ 12 గోత్రముల వారికి పంచియిచ్చెను గనుక వారికి ఆనందము అది మనకుకూడా ఆనందము, ఎందుకనగా ఈ పంచి పెట్టుట ఏదో ఒకదానికి ముంగుర్తుగా నుండును. యేసుప్రభువు తన శిష్యులకు సువార్తను లోకమంతటికి ప్రకటించుడని హక్కుయిచ్చెను. భూలోకములోని సమస్త రాష్ట్రములు ఇచ్చెను. యెహోషువ పాలెస్తీనా ఇచ్చెనుగాని యేసుప్రభువు లోకమంతా ఇచ్చెను. అది దానికి ముంగుర్తు. గనుక ఆనందదేశము. మనకుకూడా ఆనందదేశమే ఎందుకనగా పితామహుల దేశము పరలోకమునకు ముంగుర్తు. పంచిపెట్టుటకు ప్రభువు శిష్యులకిచ్చిన హక్కునకు ముంగుర్తు మరియు యెహోషువ పాలెస్తీనా పంచినట్లు రేపు వెయ్యేండ్ల క్రీస్తుప్రభువు పాలనలో పెండ్లికుమార్తెకు భూలోకమంతా 12 భాగములుగాచేసి ప్రభువు ఇచ్చును. ఈ భాగములలో వారు అన్ని భాషలలో సువార్త ప్రకటింతురు. ఇట్టి మర్మములకు ముంగుర్తుగానున్న పాలెస్తీనా ఆనంద దేశమే.

***(3) రాజుల కాలము:-*** దేవుడు అభిషేకించి రాజులను ఈ దేశమును పరిపాలించుటకై ఏర్పాటు చేసెను. వీరు పరిపాలన విషయములోనే కాక, ప్రజల ఆత్మీయ జీవితమునుకూడా కాపాడిరి. వీరుకూడా ఆరాధనలు చేయువారు. క్రీస్తుప్రభువు వెయ్యేండ్లలో రాజైయుండును. పెండ్లి కుమార్తెకూడా రాజ్యము చేయును. రాజుల చరిత్ర వెయ్యేండ్లలో పెండ్లికుమార్తె జరిగించనైయున్న రాజ్యపాలనకు ముంగుర్తు గనుక ఆనంద దేశము అను పేరు తగినదే. తలాంతుల ఉపమానములో శక్తినిబట్టి భక్తులు ఏలుటకు ముంగుర్తుగానున్న

పాలెస్తీనా ఆనందదేశమే. మనము రాజులము, యాజకులమని Iపేతురు 2:5లో ఉన్నదిగదా! వెయ్యేండ్లలో యాజకులముగాకూడ నుందుము. నేరస్తులకు తీర్పు తీర్చుటలో రాజులకు సువార్తచెప్పి వారి పక్షముగా ప్రార్థించుట యాజకులపని. సొలోమోను రాజ్యపాలన మరియు ఆరాధనకూడ చేసెను. వాటన్నిటికి ముంగుర్తుగా నున్న పాలెస్తీనా ఆనందదేశము.

***(4) ప్రవక్తల కాలము:–*** యెషయా మొదలు మలాకీ వరకు ఉన్న ప్రవక్తలు గొప్పపనులు చేసిరి. వీరు భూలోకములో ఏమి జరుగునో, వెయ్యేండ్ల పాలనలో ఏమి జరుగునో, మోక్షములో ఏమి జరుగునో, పాతాళములో ఏమి జరుగునో చెప్పియున్నారు. ఇట్టి ప్రవక్తలున్నదేశము గనుక ఇంకా ఆనందదేశము. ఆ ఆనందదేశము భూలోకమున ఆనందమునకు ముంగుర్తు. మనకు విచారము కలిగించు వాటన్నిటిని ప్రభువు కొట్టివేయును, ఆనందమే ఉండును. ఆనందమే భాగ్యము, మహిమయే భాగ్యము. మనలను భాదించుచున్నవన్నియు కొద్దిదినములలో అంతరించిపోవును. ఈ అన్నిటికి ముంగుర్తు పాలెస్తీనా గనుక ఆనందదేశము. దానికి భూమద్యదేశమని పేరు. ఇది భూలోకమునకు మధ్యగలదు. భూమి అంతటికి కనబడుటకు అట్లున్నది. బైబిలులోని అన్ని చరిత్రలు అక్కడే జరిగెను. గనుక అందరికి కనబడుటకు అక్కడనుండెను.

నిత్యానంద దేశమైన మోక్షము చేరు భాగ్యము అందరికిని కలుగునుగాక!

# ప్రవక్తయైన ఎలీషా - 1

**"అంతట ఎలీషా మరణకరమైన రోగముచేత పీడితుడైయుండగా ఇశ్రాయేలురాజైన యెహోయాషు అతనియొద్దకు వచ్చి అతని చూచి కన్నీరు విడుచుచు నా తండ్రీ నా తండ్రీ, ఇశ్రాయేలువారికి రథమును రౌతులును నీవే అని ఏడ్చెను." II రాజులు 13:14.**

ప్రవక్తయైన ఎలీషా సుమారు 20సం॥లు మిక్కిలి ముమ్మరమైన సేవ చేసియుండెను. అద్భుతములతో కూడిన పని చేసెను. దాదాపు 45సం॥లు సాధారమైన పని, అనగా శిష్యులకు బోధించుట, గ్రామములు దర్శించుట మొదలగు పనులు చేసెను. ఈ 65 సంవత్సరముల తర్వాత మరణకరమైన వ్యాధి ఆయనకు వచ్చెను. వ్యాధులు రెండు రకములు (1) వ్యాధి మందులద్వారానో లేక వేరు ఇతర మార్గముల ద్వారానో పోవునవి. (2) మరణకరమైన వ్యాధి: ఇది బాగుపడదు. దీనితో మరణము పొందవలసినదే. ఎలీషా చనిపోయిన వారిని లేపెను. ఇశ్రాయేలు రాజులును అభిషేకించెను. అట్టి భక్తుడు కూడ వ్యాధినొందెను. భక్తులుకూడ వ్యాధిని తప్పించుకొనలేరు. భక్తులు ఎందుకు జబ్బుపడుదురని అవిశ్వాసులు అందురు. పాపము చేయుట, నరకమనుభవించుట ఇవి దేవుని నుండి మానవుని ఎడబాపు చేయునవి. వ్యాధి అయితే ఉపకారము చేయునది, బలపరచునది. క్రమపరచునది. కొందరి వ్యాధి బాధకరముగా నుండదు, పనులు చేయుచునే చనిపోవుదురు. ఎలీషాకు 1) వ్యాధి, 2) బాధ, 3) మరణము గలవు. ఈ మూడు ఉన్నను ఆయన విశ్వాసము కలిగియుండెను. శ్రమలలో, కష్టములలో విశ్వాసము కలిగియుండవలెను. పౌలు చెప్పినదేమనగా: (రోమా 8:35-39)

వ్యాధియైనను...... మరియేదైనను దేవుని ప్రేమనుండి ఎడబాపనేరవు. కాబట్టి వ్యాధి వచ్చినను, బాధ వచ్చినను, మరణము వచ్చినను విశ్వాసి విశ్వాసిగానే ఉండిపోవలెను. వీటిని దేవుడు రానిచ్చుట ఒక క్రమము. యధాప్రకారముగా వచ్చు క్రమము. కష్టము వలన పోవు విశ్వాసము విశ్వాసముకాదు. గాలి వీచి, వర్షము వచ్చి, వరదవచ్చెను గాని కొండ కొట్టుకొనిపోలేదు. కొండ కొండవలె ఉండెను. అట్లే విశ్వాసికి ఎన్ని కష్టములు వచ్చినను విశ్వాసిగానే ఉండును. వరద వచ్చినప్పటికి కొండవలె స్థిరముగా నుండునది విశ్వాసము.

దైవజనుడైన ఎలీషా చివరి గడియలలో కొన్ని మాటలు చెప్పెను. సాధారణముగా మనిషియొక్క చివరి మాటలను గౌరవించెదరు. అందరు చనిపోకముందు ఏమిచెప్పెనని అడుగుదురు. ఎలీషా 60 సం॥లు పనిచేసి ఈ మాటలు చెప్పుచున్నాడు. ఈయన వరపుత్రుడు, ప్రవక్తల పాఠశాలకు అధ్యక్షుడు. కాబట్టి విలువైన మాటలు చివరగా చెప్పెను. ఎలీషా షోమ్రోనులో నున్నాడు. అచ్చటనే ఇశ్రాయేలు రాజుకూడ ఉన్నాడు. రాజు దైవజనుని దగ్గరకు వచ్చి చూచి కన్నీరు కార్చినాడు. ఎందుకనగా ఇశ్రాయేలీయులకు గొప్ప మేలు చేసిన ప్రవక్త కాబట్టి విశ్వాసులకు చింత. అవిశ్వాసులుకూడ చింతించి యుందురు. రాజునకు మరి విచారము. రాజు ప్రవక్త సలహాను బట్టి నడువవలెను. ఎలీషా సంఘనాయకుడు. రాజు రాజ్యము నడుపువాడు. అందువలన రాజు ఏడ్చి 'నాయనా' అన్నాడు. ఎలీషా రాజువైపు చూచినాడు, ఆ చూపులో అర్ధమున్నది. "నేను వెళ్ళిపోవుచున్నాను, నీవు ఏలాగుంటావు" అని అర్ధము. రాజు చెప్పిన దేమనగానీవు జనమునకు "రథము, రౌతువంటివాడవు", **రథము:** రథమనగా యోధులను కూర్చుండబెట్టుకొని ఒక స్థలమునుండి

మరియొక స్థలమునకు తీసికొని వెళ్లు సాధనము. రథములో నున్నవారికి భయము లేదు. ఏ కీడు కలుగదు. ఆలాగే క్రీస్తు ప్రభువులో నున్నవారికి ఏ కీడు కలుగదు. ఆయన మనలను ఎట్టి అపాయకరమైన స్థలమునకైనను తీసికొని వెళ్ళగలడు. అయినను ఆయన మనతో ఉన్నందున అపాయమేమియు హానిచేయదు. మంచి స్థలమునకును ఆయన తీసికొని వెళ్ళును. "క్రీస్తు ప్రభువు అనే రథము క్షేమకరమైన నివాస స్థానము." ఈలోకములో విశ్వాస ప్రయాణికులు నివసించునట్టి స్థలము. 'నాయందు నిలిచియుండుడి' అని క్రీస్తు ప్రభువు బోధించెను. ఇది జ్ఞాపకము తెచ్చుకొనవలెను. ఆయనతో నుండి దిగకుండ ఉన్నంతకాలము మనకు క్షేమము. రథము నడిచే యిల్లు. తుదకు ఈ రథము మోక్షములోనికి కూడ తీసికొని ఆయన వస్తేకాని మనము వెళ్ళలేము, మిమ్ములను తీసికొని వెళ్ళుటకు తిరిగి వస్తానని ప్రభువు చెప్పెను. **రౌతు:** యుద్ధమునకు వెళ్ళువారికి ముందుగా నడుచు వ్యక్తి ఈ లోకములో సైతానుతోను, అతని బలమంతటితోను యుద్ధము చేయు బయలుదేరు మనకు ముందుగా నడచు రౌతు యేసుప్రభువు. మార్గదర్శి యేసుప్రభువు. నేనే మార్గమునైయున్నానని యేసుప్రభువు చెప్పెను. ఇశ్రాయేలీయులు పాలెస్తీనా దేశమును స్వాధీనపరచుకొనుటకు వెళ్లునప్పుడు యెహోషువా సైన్యాధిపతిగా నుండి వారి ముందుగా వెళ్ళెను. మన యెహోషువాయైన యేసుప్రభువు అట్లే ముందు నడుచును. *ప్రవక్త ఈ మాట విని సంతోషించలేదు. అది దైవజనుల తీరు. తమ్మును గురించి తాము అతిశయపడరు, గొప్ప చెప్పుకొనరు.*

అయితే ఇశ్రాయేలీయుల రాజు చెప్పవలసిన మాటలేవనగా "యెహోవా 'నీవే రథము' నీవే రౌతువు" అనవలసినదే. నీవు మరియొక

దైవజనుని చేత నీ పని చేయించెదవు అనవలెను. మోషే చనిపోయినపుడు ఇశ్రాయేలీయుల సంఘము ఆగిపోయినదా? దేవుడు మరియొకరిని తీసికొని వచ్చి ఆ పనిని సాగించుకొనును. మోషే తర్వాత యెహోషువా వచ్చెను. దేవుని పని ఆగదు. ఒక ప్రవక్త వెళ్ళిపోయిన మరియొకరు. ఒక రాజు పోయిన మరియొకరు, ఒక బోధకుడు పోయిన మరియొకరు, దేవుని ఏర్పాటు ప్రకారము వచ్చెదరు ఈ విధముగా దేవుడు తన రాజ్యము యొక్కయు, సంఘము యొక్కయు పనిసాగించును. వీరందరికి వెనుకనున్న యెహోవా వలననే సమస్తము సాగును, ఎలీషా వల్లకాదు. రాజు దృష్టిలో ఎలీషా రథము, రౌతు. అయితే అది కొంత కాలమే. దేవుని పని సాగించుటకు, సంఘము యొక్కయు, రాజ్యము యొక్కయు రథము, రౌతు యేసుక్రీస్తే. ఇశ్రాయేలీయులు అనుకొన్నట్లు కాదు, రాజు తలంచినట్లు కాదు. ఈలోకములో దైవజనులు కొంతకాలము మాత్రము మనమధ్యన పనిచేయుదురు. కాని ప్రభువే నిజమైన నాయకుడు. మనకు రథము, యోధుడు ప్రభువే. ఆయనే ముందు నడిచివెళ్ళును. ఇప్పుడు యేసుప్రభువే మన రథము. ఈ రథములో కూర్చున్న భయముండదు కష్టము వచ్చిన ఆయనే భారము వహించి చూచుకొనును.

ఈ వాక్యభాగములో రాజ్యము యొక్కయు, సంఘము యొక్క పని సాగించుటకు యెహోవాయే రథము, రౌతు అని రాజునకు బోధించుటకు ప్రవక్త ఒక పాఠము రాజునకు చెప్పెను. ఇది (బహిరంగమునకు కనబడు) వస్తు పాఠము వంటిది. రాజ్యము, సంఘము ప్రభువునందు గురియుంచవలెను. గాని దైవజనుని యందుకాదు. దైవజనులను గౌరవించవలెనుగాని అందరికంటె ముందుగా ప్రభువు నుంచవలెను.

# దైవకృప అనే రక్షణ బాణము

**"ఎలీషా బాణము వేయుమని చెప్పగా అతడు బాణము వేసెను. అతడు- "ఇది యెహోవా రక్షణ బాణము" అని ప్రవక్త చెప్పెను. II రాజులు 13:15-17**

రక్షణ బాణము అనగా రక్షించునది అనగా రక్షణ యెహోవా చేతిలోనే ఉన్నది. అనగా దేవుడే రక్షించవలెను. అనగా విడిపించు బాణము. రక్షణ అనగా ఏమి? 1) విమోచించుట అనగా అన్ని కీడులు తొలగించుట. 2) సదుపాయము చేయుట అనగా మేలు దయచేయుట, రోగము నివారణ చేయుట. ఈ రెండు చేసిన సంపూర్ణ రక్షణ అగును. మొదట పని అనగా కీడును తొలగించుట దేవుడు చేయవలసిన పని. రెండవ పని మేలును పొందుట మనుష్య ప్రయత్నముతో కూడినది. ఉదా: అరణ్యములో పులి నోట పడవలసిన ప్రయాణికుని తప్పించిరి. ఇది మొదట పని. అయితే అతనిని అక్కడ విడిచిన రక్షించి ప్రయోజనము లేదు. పులి తిరిగి వచ్చును గనుక దగ్గరగాఉన్న గ్రామమునకు తీసికొని వెళ్ళి కాపాడుట, ఈ రెండు కలిపి రక్షణ అంటారు. ఈ రెంటిని ఇచ్చువాడు రక్షకుడు. యేసు ప్రభువు ఈ రెంటిని చేయుచున్నాడు. తప్పిపోయిన కుమారుడు తిరిగి రాగా తండ్రి చినిగిన, మాసిన వస్త్రములను తీయించి స్నానము చేయించెను. ఇది విమోచన, తరువాత మంచి భోజనము పెట్టి సదుపాయము చేసియున్నాడు. ఇదే సంపూర్ణ రక్షణ. ఇశ్రాయేలీయులకు అరామీయులు శత్రువులు. యెహోవా మన పక్షమున నున్నాడు. గనుక యెహోవా అరామీయులను వెళ్ళగొట్టును. యెహోవా కృపవలన ఇశ్రాయేలీయుల రాజు రక్షింపబడును. రక్షణ ఉచితము,

దేవుడిచ్చినది. సైతాను మనమీద శోధన బాణములు వేయును, అయితే రక్షణ దేవుని కృప వలన కలుగును. యోహాను 14:14లో "మీరు నా నామమున ఏమి అడిగినను చేతును" అని చెప్పెను. యేసుప్రభువును మనము నమ్మిన యెడల ఆయనే మనలను రక్షించును.

పౌలు ఎఫెసు పత్రికలో కృపవలన రక్షింపబడుదుమని చెప్పెను (ఎఫెసీ. 2:8). అనగా మనము పుట్టక పూర్వమే దేవుడు మన కొరకు రక్షణ ఏర్పరచియున్నాడు. దీనియందు మన ప్రయత్నములేదు. ప్రార్థన లేదు. మన ప్రయత్నము లేనిదే జరుగునది కృప. మనము పుట్టక పూర్వమే దేవుడు తన అంతరంగ ప్రేమనుబట్టి రక్షణను సిద్ధపరచియున్నాడు. దీనియందు మన ప్రయత్నములేదు. చెట్లు, జంతువులు మొదలగునవి ఏలాగు కలుగజేసెనో, ఆ విధముగానే రక్షణ సిద్ధపరచెను. కృపలేని యెడల రక్షణలేదు కృప ద్వారానే రక్షణ కలుగుచున్నది.

రెండు సంతోష వాక్యములు: 1) జయము వచ్చును 2) అది దేవుని వలన కలుగును. విచారముగా నున్నప్పుడు రెండు ఆదరణ వర్తమానములను రాజు వినెను. ఆలాగే విశ్వాసులైన వారికి విచారములో అవిశ్వాసస్థితిలో నిరాశ సమయములలో ఆదరణ ప్రభువు ఇచ్చును. ప్రభువు వలననే ఇట్టి ఆదరణ కలుగును. ప్రభువే వీటిపై జయము కలుగజేయువాడు. ప్రభువు ఇచ్చు ఆదరణ దైవజనుల ద్వారాగాని, వాక్యముద్వారా గాని మనకు వచ్చును. ప్రవక్తయైన ఎలీషా సేవలో మొదటి పర్వమైన 20సంవత్సరములు తర్వాత రాజునకు పట్టాభిషేకము చేసెను. తన విశ్వాసులకు ఆత్మాభిషేకము

ప్రభువు ఇచ్చును. అదే పరిశుద్ధాత్మ కుమ్మరింపు. యేసుప్రభువు నది ఒడ్డున నున్నపుడు ఆ విధముగా జరిగెను. ఈ అభిషేకము వలన ఆనందము, బలము వచ్చును. ఎలీషా సేవలో మరొక 45సంవత్సరములు అయిన తర్వాత రాజునకు ఆదరణ కలిగించెను. ఇది మరియొక అభిషేకము. యెహోవా రక్షణబాణము, ఇది గొప్ప ఆనందము. ఆత్మానందము, గొప్ప అభిషేకము. నా గిన్నె నిండి పొర్లుచున్నది అని (దా.కీర్తన. 23:5) ఆనందములో నిండియుండుటను బట్టి దావీదు చెప్పుచున్నాడు.

ఈ కథను కొన్ని భాగములుగా చదువవచ్చును. 1) రాజు బాణముల మీద చేయివేసెను. ఎలీషా రాజు చేతులమీద తన చేతుల నుంచెను ఇది ఒక భాగము. 2) మూడు బాణములు తీసినేలను కొట్టుట ఒక భాగము. 3) తర్వాత ఎలీషా చెప్పిన మాటలు అనగా 5 లేక 6 మార్లు ఎందుకు కొట్టలేదు. మూడుమార్లు కొట్టితివి గనుక మూడుమార్లు జయించెదవు. మరొక భాగము- 4) నాశనమగు వరకు కొట్టవలసినది మరొక భాగము మొదటిభాగములో రాజు బాణముల మీద చేయివేసెను. దేవుడను గ్రహించిన బాణములను ఉపయోగించుటకు రాజు ఇష్టపడెను.

రెండవ భాగములో బాణములను నేలను కొట్టుమని చెప్పెను. రాజు మూడుమార్లు బాణములను కొట్టి మానివేసెను. రాజు బాణములను నేలను కొట్టుటలో అర్ధములేదు. ఆలాగు కొట్టుటలో రక్షణ కలుగునను ఆశ రాజులకు కనబడదు. గాని రాజు ప్రవక్త చెప్పినట్లు చేసెను. ఇదే విశ్వాస క్రియ కాబట్టి విశ్వాసము ద్వారా రక్షణ కలుగును. రక్షణ సంపాదించుటలో రెండవ భాగము విశ్వాసము. దేవుడు రక్షణ సిద్ధపరచుట ఒక భాగము, విశ్వాసము ద్వారా గైకొనుట రెండవ భాగము.

కృప - రక్షణ - దేవుడు

విశ్వాసము - రక్షణ - మనుష్యుడు

ఈ భాగములో కృపవలన రక్షణ కలిగెను. రెండవ భాగములో విశ్వాసము ద్వారా రక్షణ వచ్చెను. రక్షణ ఒకటే. కృప వెనుక దేవుడు నిలిచియున్నాడు. విశ్వాసము వెనుక మానవుడు నిలిచియున్నాడు. మొదట దేవునికి, కృపకు, రక్షణకు సంబంధము గలదు. రెండవది మానవునికి, విశ్వాసమునకు రక్షణలేదు. ప్రభువు పెండ్లి విందుకు పిలిచినప్పుడు అందరికొరకా? లేక కొందరికి మాత్రమేనా? అందరి కొరకు సిద్ధపరచెను గాని అందరు రాలేదు. రాని వారికి విందులో పాలున్నదా? లేదు. ఆ విధముగా అంగీకరించక పోయిన రక్షణ ఎవరికిని లేదు. అయితే పాపి నేనింత పాపిని నాకు రక్షణ దొరుకునా? అని తలంచుచున్నాడు. అందువలన విశ్వాసము లేదు. ధైర్యము, సంతోషము, ప్రేరేపణ లేదు. ఇవి ఉంటే రక్షణ సిద్ధపరచబడి ఉన్నది. మనుష్యుడు దేవునియందలి విశ్వాసము సంపాదించుకొనవలెను. ఈ మూడు బాణములు రక్షణ సంపాదనకు ముంగుర్తులైయున్నవి.

# దీర్ఘదర్శి ఎలీషా

**"బాణములను పట్టుకొమ్మనగా అతడు పట్టుకొనెను. అంతట అతడు ఇశ్రాయేలురాజుతో నేలను కొట్టుమనినప్పుడు అతడు ముమ్మారు కొట్టి మానెను." II రాజులు 13:18-19**

ప్రవక్తయైన ఎలీషా ఇశ్రాయేలీయుల రాజును బాణములను నేలకు కొట్టుమని చెప్పగా రాజు ముమ్మారు మాత్రము బాణములను నేలకు కొట్టి ఊరుకొనెను. ఈ మూడు బాణముల క్రింద ఒక కథ ఉన్నది. విశ్వాసమును చెడగొట్టు కథ దాగియున్నది. అది విశ్వాసమును చెడగొట్టును రక్షణకూడా పోగొట్టును. ఎలీషా చెప్పిన దేమనగా బాణములను తీసికొని నేలను కొట్టుమనెను. నేలను కొట్టుటలో అర్ధము లేదుగాని, రాజును బాణములతో పులిని గాని, శత్రువులను గాని కొట్టుమనిన రాజునకు గౌరవముగాను, అర్ధముతో కూడినదిగా నుండును. రాజు నేలను బాణములతో కొట్టునా? నేల నెందుకు కొట్టవలెనని మనమందుము. అయితే రాజు ఆలాగున అనలేదు. మానవునిలో కూడ విశ్వాసమును చెడగొట్టునది దాగుకొనియున్నది. విశ్వాసమును చెడగొట్టుట ద్వారా రక్షణ కూడా పోగొట్టును. అవిశ్వాసికి దేవుడు అక్కరలేదు, రక్షణ అక్కరలేదు, విశ్వాసము వద్దు ఈ స్థితికి మనుష్యుడు వచ్చుచున్నాడు. ఒక అమ్మాయి దంపుడు కర్రను తీసికొని ఇసుకను దంచుచుండెను. ఇది నిజముగా ధాన్యమును దంచుటయా? ఆ అమ్మాయి ఆట కొరకు ఆలాగు చేయును. ఆలాగే రాజును బాణములతో నేలను కొట్టుమనునది ఆటగాను, వృధాగాను కనబడును. ఒక కుర్రవాడు కర్రతో కుండలో దంచును. కుండ పగిలిపోవును. ఈ విధముగానే బాణములతో నేలను

కొట్టుట వృధాగా పైకి కనబడును. అయినను ఆలాగు చేయుట విశ్వాసమునకు గుర్తైయున్నది, గాన రక్షణకూడ ముంగుర్తైయున్నది. నమ్మకపోతే నేలను కొట్టడు- కొట్టకపోతే రక్షణలేదు. ఈ మూడు బాణములు విశ్వాసమునకు ముంగుర్తైయున్నవి.

ప్రవక్తయైన ఎలీషా బాణములను నేలను కొట్టుమని అనినప్పుడు ఇశ్రాయేలీయుల రాజు అనేక పర్యాయములు కొట్టవలసినది గాని 3 సార్లు మాత్రమే కొట్టెను. విశ్వాసము యొక్క లక్షణము 1) నమ్ముట. 2) తీసికొనుట. దేవుడిచ్చిన రక్షణ నమ్ముట విశ్వాసమైయున్నది. రక్షణ తీసికొనుట కూడ విశ్వాసము వలననే అయితే విశ్వాసమునకు ఆటంకమేమున్నది. దేవుని వాక్యము (గ్రైకొనుట) అంగీకరించుట అనేకులకు ఆటంకము. రాజునకు ప్రవక్త మాట ఆటంకము కాదా? నేలను ఎందుకు కొట్టుట? దేవాలయములో పాదిరిగారు రొట్టె, ద్రాక్షారసము తీసికొని, ఇది ప్రభువుయొక్క శరీరము దీనిని తిని ఆయన రక్తము త్రాగుము అని చెప్పిన, కొందరు “అయితే దీని వలన జీవము వచ్చునా?” అని ప్రశ్నింతురు. బహిరంగమునకు వట్టిదిగా పైకి కనబడును. మూఢభక్తిగా కూడ అనిపించును.

నీవు వెళ్ళి సిలోయమను కోనేటిలో కండ్లు కడుగుకొనుమని చెప్పుట ఆటగా కనబడును. గంభీరముగా కనబడదు విశ్వాసముతో ఆ పని చేసిన మీదట ఆ మాటలలోనున్న రహస్యము విలువ తెలియును. అంజూరపు పండ్లు ముద్దగా చేసి పుండు మీద కట్టుము. పుండు పోవునని చెప్పుట కూడ తేలికగా కనబడును. నయమాను వృత్తాంతములో- ఎలీషా ప్రవక్త నయమానుతో “యోర్దాను నదిలో ఏడు మార్లు మునుగుము, కుష్ఠరోగము పోవును” అని దైవజనుడు

చెప్పెను. దేవుని మాటలు అవిశ్వాసులకు ఆటగా నుండును గనుక వారు ఫలితమును పొందలేరు. మూడు బాణములు నేలకు కొట్టవలెనా అనునది అవిశ్వాసులకు ఆటంకముగా కనబడును. విశ్వాసులు ఆ మాటల చొప్పున చేయని యెడల రక్షణ పోవును.

కొందరు కొన్ని షరతుల ద్వారా రక్షణ పొందుదురు. మరికొన్ని షరతుల ద్వారా పెండ్లి కుమార్తె సంఘములోనికి తయారగుదురు. అనేకులు పెండ్లి కుమార్తె సంఘములోనికి రాకపోవుటకు కారణము దేవునిమాట వారికి ఆటంకముగా నుండును. రక్షణలోనికి అనేకులు రాకపోవుటకు కూడ వాక్యమే వారికి ఆటంకము. రాజైన 'యెహోయాషు'- బాణములను 3మార్లు నేలపై కొట్టిన తర్వాత ఎలీషా 6 పర్యాయములు ఎందుకు కొట్టలేదు అని రాజుతో అనెను. 6 పర్యాయములు సంపూర్ణము. 3 పర్యాయములు అసంపూర్ణము. 3 పర్యాయములు రక్షణ గుర్తు. 6 పర్యాయమలు సంపూర్ణతకు అనగా పెండ్లికుమార్తె వరుసకు గుర్తు. పెండ్లికుమార్తె సంపూర్ణతలోనికి రావలెను. విశ్వాసి రక్షణ పొందుటకు మాత్రమేగాక వధువు సంఘమునకు తయారు కావలెను.

బైబిలు మిషను బోధలు ఇతరులకు ఆటంకముగా నున్నవి. 1) దర్శనవరము: దర్శనములు, ఆటగా నున్నవి. బైబిలులో ఉన్నవా? ఉన్నయెడల నిజమే. వాక్యములోనున్నది తప్పు అర్థము చేసికొన్న యెడల పెండ్లి కుమార్తె విశ్వాసము పోవును. 2) భాషావరము: భాషను గురించి చాల వివరముగా వ్రాయబడియున్నది. పరిశుద్ధాత్మ ఇచ్చు వరములలో భాష ఒకట. 1కొరింథి. 12అధ్యా॥ 3) భాషకు అర్థము చెప్పువరమును. పరిశుద్ధాత్మ ఇచ్చును వీటిని విశ్వాస సంఘము

నమ్మకపోయిన, నమ్మని వారిది సంపూర్ణ విశ్వాసము కాదు. ఇట్టివారు పెండ్లికుమార్తె వరుసలో చేరరు. *వీటిని ఆటంకపరచకూడదని* వాక్యములో నున్నది *గదా!* అయినను ఇతర విశ్వాసులు నమ్మరు. ఎందుకనగా వారు ఏర్పాటులో లేరు. ప్రపంచ జనాభాలోనుండి దేవుడు యూదులను నెందుకు బయటకు తీసెను. ఇతర రాష్ట్రముల వారు రారు; వచ్చినా ఏర్పాటులో నుండలేరు. ఆలాగుననే క్రైస్తవులలో రక్షింపబడిన వారున్నారు. *వారు పెండ్లికి ముందు కొందరు, పెండ్లికి తర్వాత కొందరు. 7 ఏండ్ల శ్రమలలో కొందరు మోక్షమునకు* వెళ్ళుదురు *గాని* పెండ్లి కుమార్తె వరుసలో చేరరు. శరీరము, ఆత్మ, రెండు కలసిన మనిషి. ప్రభువు ఇది వరకు ఆత్మలను రక్షించుటకు వచ్చెను. అయితే శరీరము ఆత్మను లాగివేయుచున్నది. ఇవియొకదాని కొకటి వ్యతిరేకముగా ఉన్నవి (గలతీ. 5:17). ప్రభువు రెండవసారి శరీరమునుకూడ మహిమలోనికి మార్చుటకు మధ్యాకాశములోనికి మేఘముపై ఆయన వచ్చును. గనుక ఇప్పుడు మీరు మీ విశ్వాసమును పరీక్షించుకొనుడి. *మీది మూడు బాణముల విశ్వాసమా!* లేక 6 బాణముల విశ్వాసమా! మీది రక్షితుల గుంపా! లేక పెండ్లి కుమార్తె గుంపా!

పెండ్లికుమార్తె గుంపుతో సిద్ధపడి వెళ్ళు కృప ప్రభువు మనకు అనుగ్రహించునుగాక! ఆమేన్.

# నోవహు ఓడ క్రైస్తవ సంఘము

ఆదికాండము 6,7,8 అధ్యాయములు

**“నీవును నీతోకూడ నీ కుమారులును నీ భార్యయు, నీ కోడండ్రును, ఆ ఓడలో ప్రవేశింపవలెను.” ఆది. 6:18.**

దేవుడు పాపముతో నిండియున్న లోకమంతటిని నాశనము చేయవలెనని నీతిమంతుడైన నోవహుతో ఒక ఓడ తయారు చేసికొమ్మని చెప్పెను. అట్లు తయారు చేసికొన్న మీదట నోవహు కుటుంబము ఎనమండుగురును సమస్త జీవులలో మగదియు ఆడుదియును ఓడలో ప్రవేశించిన మీదట, దేవుడు ఆ ఓడ తలుపు బిగించెను. తర్వాత 40 దివారాత్రులు గొప్ప వర్షము కురిసెను. భూమిపైనున్న సమస్తమును నశించెను. ఓడలో నున్నవారును, అందున్న సమస్త జీవులు మాత్రము బ్రతికెను. 40 దినముల జలప్రళయము గతించి నేల ఆరిన తర్వాత వారు ఓడవిడిచి బయటకు వచ్చి దేవునికి అర్పణ అర్పించిరి.

ఇక్కడ రెండు బొమ్మలు మనస్సులో జ్ఞాపకముంచుకొనవలెను. ఓడ మరియు సంఘము. ఓడలో జరిగినవన్నియు సంఘములో ఏదో ఒకరీతిగా జరుగును. నావలో ప్రవేశించిన వారు ప్రవేశించిన తర్వాత ఆకాశము నుండి వర్షము భూమిలోనుండి ఊటలు వచ్చెను. రెంటికి మధ్యనున్న వారు బ్రతికి ఉన్నారు. భూమి, ఆకాశము రెంటికిని సృష్టి అని పేరు. సృష్టి పాపులను నాశనము చేయుటకు పూనుకొనెను. ఇతరులైన వారు ఓడలోనికి రానందున నాశనమైరి. పాపులైనను వారు ఓడలో ప్రవేశించిన యెడల బ్రతికి యుండెడివారు. ఆకాశమునకును, భూమికిని మనిషిమీద కోపము ఎందుకనగా

మనిషి దేవుని మాట వినకపోయినందులకు, (ఆది. 7:11) మహాగాధ జలముఊటలు, ఆకాశపు తూములు నీరు పైకి ఉబికినపుడు పిల్లలు చనిపోయిరి. ఇంకా పైకి లేవగా పెద్దలును, ఇంకా నీరు పైకి లేవగా అందరు చనిపోయిరి. క్రమముగా వర్షము నీరు హెచ్చిన కొలది ప్రజలు చనిపోయిరి. రెండు పనులు జరుగుచున్నవి. నీరు పైకిలేచుట, జనులు చనిపోవుట. చనిపోకుండ ఓడకట్టబడెను గాని, వారు రాలేదు.

మరియొక కథ ఏమనగా నీరు హెచ్చిన కొలది ఓడ పైకి పోవుచుండెను. ఓడలోని వారును పైకి పోవుచుండిరి. ఓడలోనికి రాని మనుష్యులు కఱ్ఱవలన, కత్తివలన కాదు గాని నీళ్ళ వలన చనిపోయిరి. పాపులను చంపినది ఆ నీరే. నీతిమంతులను బ్రతికించినది ఆ నీరే. ఆ నీటివలన ఓడలోని 8మంది బ్రతికిరి, ఓడ కూడ బ్రతికెను.

దీనికి సాదృశ్యముగా నేటి లోకములో ఒక ప్రక్క క్రైస్తవ సంఘమున్నది. ఈ సంఘమను నావ మనుష్యులను రక్షించుటకు ఏర్పాటాయెను. మనుష్యులు చావకుండుటకును, నరకమునకు పోకుండుటకును, సంఘము ఏర్పాటాయెను. తిట్టుకొనువారు, కొట్టుకొనువారు, దోచుకొనువారును, అబద్ధము లాడువారు మోక్షమునకు వెళ్ళక నరకమునకు పోవుదురు. వారు ఓడలోనికి వెళ్ళిన చావు లేకుండ నుండి యున్నట్టు, పాపులు సంఘములోనికి వచ్చిన రక్షింపబడుదురు. చెడ్డవారైనను ఓడ ఎక్కిన యెడల బ్రతికియుందురు. *ఆలాగే చెడ్డవారైనను సంఘములోనికి వచ్చిన యెడల వాక్యము నేర్చుకొని పాపము మానివేతురు, రక్షింపబడుదురు.* ఆ కాలములోని ప్రజలు నీటిలో మునగక ముందు పాపములో

మునిగియున్నారు. పాపములో మునిగిరి గనుక నీళ్ళలో నాశనమైరి. క్రైస్తవ సంఘములోనికి వచ్చిన వాక్యము విని మారిపోవుదురు. పాపాత్ములైనను సంఘములోనికి వెళ్ళువారిని దేవుడు ఆపుచేయడు. అప్పుడు ఓడలోని వారు 8మంది. ఇప్పుడు క్రైస్తవ సంఘములోనివారు 400కోట్లు. అందరు రక్షింపబడరు గాని పాపములు మానివేసిన వారు మాత్రము రక్షింపబడుదురు. సంఘములో ప్రతి దినము పాపములు మానివేయుమని బోధింతురు.

నోవహు ఓడ, భూమిని, చెట్లను, గుట్టలను శవములను అన్ని అడ్డులను దాటుకొనిపోయెను. ఆలాగే క్రైస్తవ సంఘములోనికి వచ్చినవారు అన్నిటిని దాటి మోక్షములోనికి పోవుదురు. మరియు ఓడలోనున్న వారిని దుర్మార్గులు గాని, శవములు గాని ఏమియు చేయలేదు. ఓడ బలముగా కట్టబడెను గనుక ఊటనుగాని, చెట్లనుగాని గుట్టలనుగాని లెక్కచేయలేదు. అలాగే క్రైస్తవ సంఘములో నున్న వారిని  ఎవరు ఏమియు చేయలేరు. క్రైస్తవ సంఘము అన్ని కీడుల నుండి మనుష్యులను తప్పించుటకు ఏర్పాటాయెను. క్రైస్తవ సంఘమునకు ఎన్ని ఆటంకములు కలిగినను ఈ రెండు వేల శతాబ్దముల నుండి ముందుకు సాగిపోవుచునేయున్నది. ఆ కాలములోనివారు చేసిన ఒక గొప్ప పాపమేమనగా నావలోనికి ప్రవేశింపకపోవుటయే; వారు పాపములు మానక పోయినను ఓడలోనికి పోయిన, బ్రతికి యుండెడివారు. ఓడపైకి లేచెను, నీరు పైకిలేచెను. పాపులు మాత్రము క్రిందికి పోయిరి. ఓడ పైకి వెళ్ళిన తర్వాత దేవుడు గాలి విసరునట్లు చేసెను, గనుక నీరు ఎండిపోయెను. నీటితోపాటు ఓడ క్రిందికి దిగెను,  ఓడలోని మనుష్యులు దిగిరి.

40 దినముల జలప్రళయములో పాపములోనున్న జనులందరు చనిపోయిరి గనుక పాపమంత నశించెను. నేల శుభ్రముగా నుండెను. అప్పుడు భూమి క్రొత్త భూమివలె నుండెను. పాత భూమి మారిపోయెను. సంఘము ప్రభువుయొక్క రాకడలో పైకి వెళ్ళిన తర్వాత *ఓడ క్రిందికి దిగినట్లు, సంఘముకూడ మరల భూమిమీదికి వచ్చును.* క్రీస్తు ప్రభువు మిగుల త్వరగానేవచ్చి, క్రైస్తవ సంఘమనే ఈ ఓడను మోక్షమునకు తీసికొనివెళ్ళి, మరల భూమి మీదికి వచ్చునప్పటికి భూమి శుభ్రముగా నుండును.

ఆ జల ప్రళయములో ఓడపైకి లేచునప్పటికి భూమిమీద మనుష్యులకు శ్రమ కలిగెను. ఆలాగే ప్రభువుయొక్క రాకడలో సంఘము పైకెత్తబడగానే భూమిమీద 7 ఏండ్ల మహా శ్రమలు కలుగును. ఈ ఏడేండ్ల శ్రమ గడిచిన తర్వాత క్రీస్తుప్రభువు పెండ్లికుమార్తె సంఘముతో వచ్చి, భూమిమీద వెయ్యేండ్లు పరిపాలన చేయును. అప్పుడు 12 మంది శిష్యులు 12 సింహాసనములపై కూర్చుండి రాజ్య పరిపాలన చేతురు. రాకడలో ఎత్తబడిన సంఘములోని వారు అన్నిచోట్ల సువార్త పని చేయుదురు. అప్పుడు కోటానుకోట్లు జనులు క్రైస్తవ మతములోనికి చేరుదురు. క్రైస్తవ సంఘము రాకపూర్వము 4,400 సం॥లు ముందే జరిగిన ఈ ఓడ కథ క్రైస్తవ సంఘము కాలములోకూడ జరుగును. జలప్రళయములో సృష్టి అను భయంకర సింహము పాప నరులమీద కోపగించి ఉరుములనే గర్జన చేయుచు, వర్షమువలె మీద పడుచు రెండు దౌడలమధ్యను ఆకాలము నాటి పాపపు ప్రజలను నమలకుండ మ్రింగివేసెను. పైదౌడ ఆకాశము, క్రింది దౌడ భూమిగా మనము సరిపోల్చుకొనవచ్చును.

ఆలాగే నేటి క్రైస్తవ సంఘకాలమున దేవుని (సువార్త) మాటను విశ్వసించి స్థిరులైనవారు (లేక) విశ్వసించిన అస్థిరులైనవారు, మొత్తముగా వారినైన వీరినైనా ఎవరిని మింగుదునా అని అపవాదియైన సాతాను (1పేతురు 5:8-9) గర్జించు సింహమువలె ఎదురుచూచుచున్నాడు. గనుక క్రీస్తు యేసు రాకడకు సిద్ధపడని వారిని అనగా పాపపు బ్రతుకు విడువని వారికి, నోవహు కాలపు జలప్రళయ తీర్పు శిక్ష విధింపువంటిదైన ఏడేండ్ల మహాశ్రమలు కలుగును. అట్టి మహాశ్రమల కాలమునకు మనము ఉండకుండా, ఈ భూమిపై ఉన్నప్పుడే క్రైస్తవ సంఘమనే ఓడలోచేరి, పెండ్లి కుమార్తెగా సిద్ధపడి ఆయన (రాకడలో) మేఘముపై వచ్చినప్పుడు ఆయన చెంతకు చేరుదుముగాక ఆమేన్.

# నోవహు ఓడ - క్రైస్తవ మతము

**"చితిసారకపు మ్రానుతో నీకొరకు ఓడను చేసికొనుము. అరలుపెట్టి ఆ ఓడను చేసి లోపటను వెలుపటను దానికి కీలు పూయవలెను." ఆది. 6:13-14.**

## (నోవహు చేసిన బోధలు)

ప్రళయము వచ్చును. ఓడలోనికి రండి, పాపములు మానివేయండి, ఇంకా పాపము చేసిన వరద వచ్చి మ్రింగివేయును. దేవుడు గోఫెరు కర్రతో (తెలుగులో చితిసారకపు మ్రాను) ఓడ కట్టుమని చెప్పెను. ఆర్మీనియా దేశములో ఆ కర్రగలదు, గట్టిది, చినిగిపోదు, పురుగుపట్టదు. దానిమీద కీలుకూడ పూసెను. "దేవుడు చెప్పినట్లు చేసిన ఆయన", అది నోవహుయొక్క బిరుదు. రైతు చెప్పినట్లు పాలేర్లు చేయవలెను. తండ్రులు చెప్పినట్లు పిల్లలు చేయవలెను. అది మంచి బుద్ధి, ఘనమైన బుద్ధి. వీటన్నిటికన్న దేవుడు

చెప్పినట్లు చేయుట ఎక్కువ. గనుక మనందరికి ఆ బిరుదు రావలెను. అప్పుడు మేలు కలుగును. చెప్పినట్లు చేయు పిల్లలను చూచినప్పుడు ముద్దు వచ్చును. అట్లే దేవుడు చెప్పినట్లు చేసిన ప్రేమ కలుగును. దేవుడు ఇంకొక పని చేసెను. పక్షులకు, జంతువులకు, ప్రాకు పురుగులకు మీరు పలాని ఓడలోనికి వెళ్ళవలెనని చెప్పెను. వాటి మనసులో దేవుడు ఆలోచన కలిగించగా అవి ఓడలోనికి వచ్చెను. పక్షులు, జంతువులు, పురుగులు కలసి జీవరాసులనబడును. ఈ జీవరాసులు దేవుడు చెప్పినట్లు చేసెను. ఓడలోనికి వెళ్ళిన వారు 8గురు. ఒక్క మాటలో ప్రజలు 1) నోవహు 2) అతని కుటుంబము 3) జీవరాసులు. ఈ మూడు గుంపులు దేవుడు చెప్పినట్లు చేసెను. నోవహు దేవుడు చెప్పినట్లు ఓడ కట్టెను. నోవహు కుటుంబము అంతా ఓడలోనికి వెళ్ళెను. జీవరాసులు కూడ నావలోనికి వెళ్ళెను. ఈ మూడు గుంపులను 'దైవ మతస్థులు' అని చెప్పవచ్చును. దేవుడు చెప్పినట్లు చేసిరి గనుక దైవమతము గలవారు.

ఈ కథ దేవుని గ్రంథముమగు బైబిలులో గలదు. దేవుడు చెప్పిన మాటలు అందులో గలవు. ఈ కథ బైబిలులోనిదే దీనిలో ఇంకొక కథ కలదు. యేసుప్రభువు పెండ్లికి ఒక ఇంటికి వెళ్ళెను. అక్కడ మరియ నీళ్ళు మోయువారితో ఒక మాట చెప్పెను. యేసుక్రీస్తు మీకు ఏమి చెప్పునో అది చేయండి అని చెప్పెను. (యోహాను 2:5) బైబిలు మిషను ఇదే కలిగియున్నది. ఆ నీరు మోయువారు ప్రభువు చెప్పినట్లు చేయగా పెండ్లివిందులోని అక్కర తీరెను. అలాగే నోవహు దేవుడు చెప్పినట్లుచేయగా వారికి రక్షణ కలిగెను. ఓడలోనికి వెళ్ళిన వారు రెండు గుంపులు 1) మనుష్యులు 2) జీవరాసులు. మనుష్యులందరు దేవుడు చెప్పినట్లుగా చేయలేదు. జీవరాసులన్నియు

రాలేదు. దేవుడు ఏ జీవరాసులకు చెప్పెనో అవే వచ్చెను. రక్షించుటకు అక్కడ ఓడ గలదు. ఇప్పుడు సంఘము ఉన్నది. అక్కడ ఓడ సిద్ధముగా నున్నది వారు రక్షింపబడిరి. అలాగే ఇప్పుడు సంఘము సిద్ధముగా నున్నది. అప్పుడు ఎనమండుగురే గలరు. గాని ఇప్పుడు కోటానుకోట్లు ఉన్నారు గనుక ఇదే గొప్పది. దేవుడు వాటి మనసులో ఆజ్ఞ పుట్టించగా జీవరాసులు ఓడలోనికి వచ్చెను. ఉదా:- ఇంకా కొంచెము సేపటికి భూకంపము వచ్చుననగా పక్షులకు తెలియును. అప్పుడు పక్షులు ఇండ్ల దగ్గరకు, మనుష్యులున్న చోటికి వెళ్ళును. జంతువులు, పశువులు కట్టుగ్రలు నుండి లాగుకొనును. అప్పుడు కూడా ఆలాగే జరిగియుండ వచ్చును. జీవరాసులు దేవునిమాట వినెనుగాని, మనుష్యులు వినలేదు కోటానుకోట్ల జనులు రాలేదు. ఈ పాఠములో జంతువులు దేవుని మాట వినెను గనుక మనుష్యులకన్న జంతువులే గొప్పవి.

ఆ ఓడ అందరికి కట్టబడెను గాని ఒక్క నోవహు కుటుంబమే అందు ప్రవేశించెను. నేటికాలమున క్రైస్తవమతముకూడ అందరికొరకు ఏర్పాటు చేయబడెను. జీవరాసులన్నియు ఓడలోనికి వచ్చినట్లు అన్ని కులములవారు క్రైస్తవ మతములోనికి వచ్చుచున్నారు. ముందుకు సంఘమను ఓడ వచ్చునని తెలియును. గనుక దేవుడు నావకథ జరుగనిచ్చెను. ఈ రెంటికిని అనగా ఓడకు, క్రైస్తవ సంఘమునకు ఒకటే పిలుపు "రండి" అని చెప్పుచున్నవి. క్రైస్తవమతము అన్ని కాలములకు అన్ని దేశములకు, అందరికొరకు ఇదేమతము. నోవహు ఓడ కట్టించి కుటుంబమును రక్షించుకొనెను. నశించువారు రెండు గుంపులవారు. అక్కడ ఓడలోనికి రానివారు, ఇక్కడ సంఘములోనికి రానివారు. క్రైస్తవ మతము సార్వత్రిక మతము. అందరిని చేర్చుకొను మతము. అయితే మతములోనికి వచ్చిన తర్వాత అన్ని విషయములు

నేర్చుకొందురు.

బడిపెట్టి నేర్పించిన పిల్లలందరు పై తరగతిలోనికి వెళ్ళరు. వారు పాసుకాకపోతే పంతులు గారు ఏమిచేస్తారు. ఓడలోనికి రాకపోతే నోవహు ఏమిచేస్తాడు? అలాగే సంఘములోనికి రానివారిని మనమేమి చేస్తాము. ఆ కాలములో జరిగినట్లు ఈ కాలములో కూడ జరుగును. నోవహు కాలములో లోకము ఎలాగున్నదో లోకాంతమందుకూడ అలాగే యుండునని యేసుప్రభువు చెప్పెను. మత్తయి. 24:38; లూకా 17:26. అప్పుడు నోవహు చెప్పిన బోధ వినలేదు. ఇప్పుడుకూడ బోధ వినరు. ప్రభువు రాకడ సమయములోకూడ నోవహు కాలములో జరిగినట్లు పరిస్థితులు ఉండును. జలప్రళయము వచ్చునని చెప్పిన తర్వాత కొందరు పొలమునకు వెళ్ళిరి, కొందరు మేడలు కట్టుచుండిరి, కొందరు పెండ్లిండ్లు చేయుచుండిరి, కొందరు తినుచుండిరి. నోవహు చెప్పినను ఓడలోనికి రాలేదు. తెలివిగల వారు వచ్చిరి. మిగతవారు నిర్లక్ష్యము చేసిరి. వారు వారి పనులమీద నుండగా తుఫాను తన పనిమీద నుండి వారందరిని నాశనము చేసెను. ప్రభువు వచ్చు ఈ కాలములోకూడ పాపము చేయవద్దు అని బోధించినను మానరు. చివరకు నాశనములోనికి పోవుదురు. నోవహు కాలములో జరిగినవన్నియు ఇప్పుడు జరుగుచున్నవి, గనుక యేసుప్రభువు వచ్చువేళ కూడ అయినది. అందుకే పాపాలు ఎక్కువ, జబ్బులు ఎక్కువ, కంగారు ఎక్కువ. అన్ని దుష్టస్థితిగతులు ఎక్కువాయెను. నోవహు కాలములో అతిక్రమము విస్తరించెను, గనుక వరద వచ్చెను.

ఈ కాలములో ఇవన్ని జరుగుచున్నవి గనుక క్రీస్తుప్రభువు వచ్చువేళ అయినది. ఆయన వచ్చి తన్ను నమ్మినవారిని తీసికొనిపోవును. ముందు పాపము వచ్చును. దానినిబట్టి శిక్ష

వచ్చును. ఇప్పుడు ప్రతిచోట పాపమున్నది గనుక నాశనము సమీపముగా నున్నది. రాకడ కూడ సమీపముగా నున్నది. 1634సం॥లో భూకంపము వచ్చునని శాస్త్రజ్ఞులు తెలియజేయగా అందరు వారిని వేళాకోళము చేసిరి, ఇది గ్రహించి వినిన కొందరు తప్పించుకొన్నారు. వేళాకోళము, హేళనచేసి అక్కడ ఉన్నవారు చనిపోయిరి. గవర్నమెంటువారు ఆ చోటును త్రవ్విచూడగా 18 దినములు తర్వాత బ్రతికిన ఒక మనిషి కనబడెను. అతని రెండు ప్రక్కల వంటి గడ్డలు వంటివి ఉండెను. పైనగడ్డ క్రిందిగడ్డ మధ్య ఆ మనిషి ఉండెను. బ్రతికి ఉన్నాడు. త్వరలోనే ఇట్టి నాశనము రానైయున్నది. గనుక త్వరగా రానున్న యేసు అను కీర్తన పాడుచు, పాపము విడిచిన నాశనము తప్పించుకొందుము.

క్రీస్తుప్రభువు రాకడకు సిద్ధపడు కృప ప్రభువు మనకు అనుగ్రహించునుగాక! ఆమేన్.

# నోవహు నావ - దేవుని నిబంధన

**"దేవుడు- నాకును మీకును మీతోకూడనున్న సమస్త జీవరాసులకును మధ్య నేను తరతరములకు ఏర్పరచుచున్న నింబంధనకు గురుతు ఇదే." (ఆది. 9:12)**

నోవహు నావదిగినకొండ అరారాతు కొండ. ఈ నావ ఇప్పటి వరకున్నది. అనగ 40 వందల సంవత్సరములు ఆలాగే దాచబడి యున్నది. వర్షము రాకముందును, వర్షము ఆగిపోయిన తర్వాతను మేఘములు కనబడును. ఆ మేఘములలో 7 రంగుల దేవుని ధనస్సు కనబడును. ఉదా:- గాజు గ్లాసులో నీరుపోసి సూర్యునికెదురుగా పెట్టిచూచిన 7 రంగులు కనబడును. మూడు మూలలుగల అద్దములోకూడ 7 రంగులు కనబడును. ఈ 7 రంగులు

సూర్యునిలోనుండి వచ్చును. ఈ ఏడు రంగుల కలయికయే సూర్యుడైనాడు.

వారు ఓడదిగి వచ్చిన తర్వాత దేవుడు వారితో ఒడంబడిక చేసెను. (1) ఇకమీదట ఇట్టి వరద పంపను. (2) నాకు మీకు మధ్య ఒక నిబంధన స్థిరపరచుచున్నాను. (3) ఎల్లప్పుడు నా ధనస్సు గుర్తుగా చూపించుదును. వరదవల్ల కొన్ని ఊళ్ళు మునిగిపోవుచున్నవి, గాన దేవుడు చేసిన నిబంధన ఏమనగ, లోకమంతటిని నాశనముచేయు వరద రానివ్వనని వాగ్ధానము చేసెను. ఇది దేవునిమాట– నిబంధన, అది దేవుని అగ్రిమెంటు, ధనస్సు పంపుటయే ఆ మాట నిలుపుకొనుట. ఆ 7 రంగులు దేవుని దయను చూపుచున్నవి. ఆ 7 రంగులను చూచి మనము సంతోషింతుము. ఆకుపచ్చ, ఎరుపు మొ।।న రంగులనుచూచి సంతోషింతుము. అంతేకాకుండా దేవుడు ఏడు రకములుగా దయను చూపించు చున్నాడు. వారముయొక్క మొదటి దినమైన ఆదివారము మొదలు చివరి దినమైన శనివారము వరకు మనపై ఏడు రకములైన దయను చూపించుచున్నాడు. దేవుని ప్రేమయే ఆ 7 రంగులు తెలియజేయుచున్నవి. ఉదా:– ఊయలతొట్టిలో కట్టిన గిలకయొక్క రంగులను చూచి ఏడ్చుచున్న పసిబిడ్డ ఊరుకొనును. అలాగే కష్టములలోనున్న వారున్ను, మనమును ఆయన దయనుచూచి ఆదరణ పొందుదుము. మనకు ఆకాశమేఘముమీద కనబడిన ధనస్సును చూచినప్పుడెల్ల దేవునిదయ భూమిమీద ఉన్నదని జ్ఞాపకము చేసికొనవలెను. అట్లు జ్ఞాపకము చేయుటకే ఆ ధనస్సు మేఘములోనికి వచ్చినదని తెలిసికొనవలెను. జీవరాసులతోను, మీతోను, రాబోవువారితోను నా నిబంధన స్థిరపరచెదనని దేవుడు చెప్పెను. ధనస్సు కష్టకాలమైన తర్వాత కనబడినది. మనకుకూడ కష్టకాలము వచ్చిన తర్వాత దేవుని ఆదరణ, ప్రేమ కనబడును. ఏలాగనిన బిడ్డ ఏడ్చిన తర్వాత తల్లి ఆదరించును. ధనస్సునుబట్టి దేవుని ప్రేమ కనబడునని తెలియుచున్నది.

# మోక్షబోధ కలిగిన ఓడ

**"విశ్వాసమునుబట్టి నోవహు అదివరకు చూడని సంగతులను గూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై తన ఇంటివారి రక్షణకొరకు ఒక ఓడను సిద్ధముచేసెను." హెబ్రీ. 11:7**

ఎవరైనను దేవునివాక్య బోధ వినునప్పుడు మనోనిదానము కలిగియుండవలెను. క్రీస్తు ప్రభువును నమ్మువారు తూలిపోరు. తోమాకు అనుమానము అను గాలితుఫాను, లోతుభార్యకు సంసారమను గాలితుఫాను, కాని నోవహు కాలములోనిది నిజమైన గాలితుఫాను. నోవహును దేవుడు ఏర్పరచుకొని రెండు సంగతులు చెప్పెను. (1) జలప్రళయము వచ్చును. అందరు చనిపోవుదురు, జీవరాసులన్నియు చనిపోవును. (2) ఎవ్వరును మునిగి చనిపోవనక్కరలేదు. ప్రళయము రాకముందు ఓడలోనికి రండి అని దేవుడు చెప్పెను. నోవహు ఈ వార్త ప్రజలందరికి వినిపించెను.

ఆయన ఓడ కట్టించుచున్నాడు, బోధ చేయుచున్నాడు. ఆయన చేసిన బోధ- 'గాలివాన వచ్చును, నావలోనికి వచ్చిన బ్రతుకుదురు' అనిమాత్రమే అప్పటికాల ప్రజలు విన్నారుగాని నమ్మలేదు. ముసలివాడు ఏదో చెప్పుచున్నాడుగాని వానిమాటలు నమ్మరాదు. వచ్చినా అంతపెద్ద వర్షము వచ్చునా? రాదు. ఒకవేళ అంతపెద్ద వర్షము వచ్చిన చెట్లు ఎక్కవచ్చును అని బోధకు లోబడలేదు. వారు ఆయనయొద్దకు రాలేదు, ఆయనే వారిదగ్గరకు పోయెను. వారియొక్క చెవులలో నోవహు వర్తమానము పడెనుగాని, వారి హృదయములలో పడలేదు. ఇప్పుడును సంఘములోనికి రమ్మంటే అట్టిమాటలే అనుచున్నారు. రమ్మని చెప్పినప్పుడు రానంటే ఏమి

చేయవలెను. వారు రాకపోతే నోవహు, నిలబడవలెనా? వర్షము వచ్చువరకు? ఆలాగున్నయెడల నోవహుకూడ మునిగిపోవును. 120 సం॥లు నోవహు చెప్పెను, గాని వారు వినలేదు. వినకపోదా నీవు బ్రతుకుదువా! మేము నశించిపోతామా! అని ఎదిరించిరి. దేవుడు నోవహుతో ఇంకా 7 దినములకు జలప్రళయము వచ్చునని చెప్పెను. గనుక ఏడవదినమున ఓడలోనికి పోవుటకు నోవహు సిద్ధపడు చుండెను. తర్వాత ఎవ్వరును ఓడలోనికి పోవుటకు వీలులేదు. 120 సం॥లు వినకపోయిన 7 రోజులలోనైన వింటే బ్రతికియుందురు. ప్రజలందరు చూచుచుండగా అన్ని ఓడలోనికి పోవుచున్నవి. పక్షులు, జంతువులు, జీవరాసులు మగది, ఆడది జతలుజతలుగా ఓడలో ప్రవేశించుట వారందరు చూచిరి. అన్ని ఓడలో ప్రవేశించెనుగాని మనుష్యులే మిగిలిరి. అప్పుడు వచ్చినయెడల ఆయన రానిచ్చును, గాని వారు నవ్వి హేళనచేసిరి. జలప్రళయము ఏమిరాదు, ఆయనకు పిచ్చిపట్టినదనిరి. దేవుడు 120 సం॥లు కనిపెట్టెను, 7 దినములుకూడ కనిపెట్టెను గాని వారిలో ఎవరును రాలేదు. పశువులు, పక్షులు, జీవరాసులు, నోవహు కుటుంబము ఎనమండుగురు ఓడలో ప్రవేశించిరి. మిగతా వారికి శిక్షరావలెను, జలప్రళయము రావలెను. గనుక దేవుడు ఓడ తలుపు బిగించెను. తలుపు వేసిన తర్వాత ఎవరైన వచ్చినను లాభములేదు. దేవుడు ప్రవేశించి తలుపు బిగించెను. ఓడలోపల జీవరాసులు, నోవహు కుటుంబము సామానులు, ఆహారము మరియు ప్రభువుకూడ వారితో నుండెను. ప్రభువే తలుపు వేసెను. వారికి భయమున్నదా? ప్రభువు వారితో లోపల ఉన్నాడు గనుక భయములేదు. తలుపువేసిన వెంటనే గాలివాన వచ్చెను.

ఆది. 19:10లో దూతలు లోతును లోపలికిలాగి తలుపు బిగించగానే బయటనున్న వారి కన్నులు గ్రుడ్డివాయెను. తలుపు వేయబడగా శ్రమ తప్పదు. తరువాత గాలివాన వచ్చినది. కొందరు ఇండ్లపైకి, తర్వాత చెట్లమీదికి, తర్వాత కొండలమీదికి వెళ్ళిరి. నీరుకూడ వీటన్నిటిని ముంచివేసెను. ఇంకెక్కడికి వెళ్ళగలరు, ఈదుకొని వెళ్ళినారు. కాని అందరు చనిపోయిరి. జలప్రళయము వచ్చువరకు వారు ఎందులో మునిగియున్నారు? పాపములో మునిగియున్నారు. గనుక ఈ వేళ మునిగిపోయినను పరవాలేదు. అనే అజ్ఞానములో వారు మునిగిపోయిరి. అవిధేయత, అపనమ్మిక, హేళనచేయుట వీటన్నిటిలో మునిగిరి. వారు మునుగుటకు ఒప్పుకొన్నారుగాని బ్రతుకుటకు ఒప్పుకొనలేదు. అటువంటివారు మన కాలములోనున్నారా? ఈనాడు ప్రజలకుకూడ రండి అని బోధకులు చెప్పుచున్నారు.

(మత్తయి 11:28) "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా నా యొద్దకు రండి" అని ప్రభువు పిలుచుచున్నాడు. నోవహు ఓడలోనికి అందరిని రమ్మని పిలుచుచున్నట్లు ప్రభువు పిలుచుచున్నాడు బోధకులుకూడ పిలుచుచున్నారు. 1. ఆలయము లోనికి రండి. 2. బైబిలులోనికి రండి. 3. మతములోనికి రండి. 4. మోక్షములోనికి రండి. ఆలయములోనికి వచ్చిన బైబిలులోనికి రాగలరు. బైబిలులోనికి వచ్చిన మతములోనికి రాగలరు. మతములోనికి వచ్చిన మోక్షము లోనికి రాగలరు. ఆలయములో దేవుని మాటలు చెప్పుదురు. పాపము మాని క్రీస్తులోనికి రండి అని చెప్పుదురు. క్రైస్తవ మతమే మోక్షమునకు నడిపించు ఓడ. క్రైస్తవ

ఆలయమునకు వచ్చిన యెడల బోధలోనికి వత్తురు. బోధనచ్చితే మతములోనికి వస్తారు. మతములోనికి వచ్చిన మోక్షములోనికి వెళ్తారు. మతములోనికి వచ్చిన తర్వాత మోక్షము చేరకముందు ఇంకొకటి గలదు ఇహలోక జీవితములో అనేక కష్టములు వచ్చును. ఈ కష్టములన్నియు సహించిన తర్వాత మోక్షము. ఓడలోనికి వచ్చిన ఎనమండుగురిలో హాము మంచివాడుకాడు. అతను వచ్చినందుకు దేవుడేమియు అనలేదు. అలాగే చెడ్డవారు మతములోనికి వచ్చిన యెడల దేవుడు వారినేమియు అనరు.

మోక్షమునకు వెళ్ళువారు రెండు భాగములు: (1) నూతన యెరూషలేమునకు వెళ్ళువారు, అక్కడ ప్రభువుయొక్క సింహాసనము ఉండును. మతములోనికి వచ్చిన తర్వాత మేఘము వచ్చును. ఎక్కువ భక్తిగలవారు ఈ మహిమ మేఘమెక్కి నూతన యెరూషలేము వెళ్తారు. (2) తర్వాత మిగిలిన క్రైస్తవులు రక్షితుల మోక్షములోనికి వెళ్ళుదురు. ఆ కాలములోని ఓడలోనికి పశువులు వెళ్ళెనుగాని మనుష్యులు వెళ్ళలేదు. ఎంత విచారము. జీవరాసులన్నిటికన్న తెలివిగల– "మనిషి" ఓడలోనికి రాలేదు. ఓడలోనికి వస్తారా? వెలుపల ఉండిపోతారా? ఇది నోవహు బోధ. ఆలాగే క్రైస్తవ బోధలుకూడ– క్రైస్తవ సంఘములోనికి వస్తారా? బయట ఉంటారా? అని అడుగుచున్నారు. సంఘములోనికి వచ్చిన యెడల రక్షణ, సంఘమునకు వెలుపలనున్న శిక్ష వచ్చును. క్రైస్తవ సంఘములోనికి వచ్చునట్టి కృప ప్రభువు మీకు దయచేయును గాక! ఆమేన్.

# నోవహునావ - క్రైస్తవ నీతివిశ్వాసము

**"అప్పుడు యెహోవా ఓడలో అతని (నోవహును) మూసివేసెను" (ఆది. 7:16)**

దేవుని మాట చొప్పున ఆయన తీర్పు దినమున జలప్రళయము భూమిమీదకి వచ్చినప్పుడు నోవహు ఓడప్రక్కన నీరు, అడుగుననీరు, పైన నీరుగలదు. ఈలోకములో క్రైస్తవుని బ్రతుకుకూడ ఆలాగే యుండును. చుట్టును ఆపదలతో నిండియుండును. (1) కొన్ని ఆపదలు మనిషి తెలివి తక్కువవలన, అజ్ఞానము వలన వచ్చును. వీటిని ఓడ అడుగున నున్న నీటితో పోల్చవచ్చును. (2) మరి కొన్ని ఆపదలు ఇతరుల వలన వచ్చును. వీటిని ఓడ ప్రక్కనున్న నీటితో చెప్పవచ్చును. (3) మరికొన్ని కష్టములు పైనుండి దేవుని వలన కలుగును. వీటిని పైనుండి పడు జలధారకు సరిపోల్చవచ్చును. మనకు బుద్ధి చెప్పుటకు మనలను సరిజేయుటకు దేవుడు వీటిని రానిచ్చును.

దేవుడు నోవహును ఓడలోనికి "రమ్ము" (come) అని పిలిచి తలుపులు మూసివేసెను. అనగా దేవుడు ఆ ఓడలో నున్నాడు. అందులో ఉండి నోవహును పిలిచెను. విశ్వాసి జీవితములో కూడ బహిరంగ శరీరమునకే ప్రభువు శ్రమలు పంపించును. అంతరంగములో ప్రభువు ఉండును. గనుక విశ్వాసి భయపడడు. ప్రభువు ఆపదలను విశ్వాసి లోపలికి ప్రవేశింపనియ్యడు. గనుక విశ్వాసి భయపడనక్కరలేదు. దేవుడు మనకు అన్ని సదుపాయములిచ్చి, తుదకు రక్షణకూడ ఇచ్చినను మనుష్యునికి ఇంకను సందేహమే. మనిషి వృద్ధిలోనికి రాకపోవడమునకు కారణము భయము. ఎన్ని కష్టములున్నను ప్రభువు మన చెంత నున్నాడు అను దృష్టి మానవుడు కలిగియుండవలెను. ఆయన లేకుండ విశ్వాసిని ఎప్పుడు ఒంటరిగా కష్టములలో నుంచడు. ఓడలోనికి నీరు రాకపోవడమునకు కారణము ఓడకు కీలుపూసి యున్నారు. ఓడలోపల నున్న వారికి కీడు రాలేదు. ఎందుకనగా ప్రభువు వారితో నున్నారు. ఒకవేళ శరీరమునుబట్టి భయము

కలుగవచ్చును గాని హానిమాత్రము ఉండదు. సొదొమలో దూతలు లోతును లోపలికి లాగి తలుపువేసిరి. ఎందుకనగా బయట శత్రువులున్నారు. ఆలాగే విశ్వాసికి కష్టముండునుగాని హానిమాత్రము రాదు. మరియు పరలోకమే ఈ నావ అని చెప్పవచ్చును. భూమిమీదనున్న అవిశ్వాసులు నావకు ప్రక్కనున్న నీటితో సరిపోల్చవచ్చును. వీరు సంఘమునకు శత్రువులు, అయితే పెండ్లికుమార్తె 7సం॥ల శ్రమలు రాకముందే, ఆ శ్రమలను చూడకుండనే వెళ్ళిపోవును. ప్రభువు సంఘమును తీసికొనిపోవును. ఉదా: ఒక గ్రామములో ఇంకను రెండు లేక మూడు దినములకు కలహము వచ్చునని తెలిసి ఆడపిల్ల తండ్రి తన బిడ్డ కలహములో పడకుండ తీసికొనిపోయెను. ఆలాగే 7 ఏండ్లు శ్రమలలో పడకుండ ప్రభువు సంఘమును తీసికొని వెళ్ళును. ఓడ అరారాతు కొండపైకి వెళ్ళి క్రిందికి దిగినరీతిగా పెండ్లికుమార్తె ఎత్తబడి, నూతన యెరూషలేములో ఏడేండ్లు విందులోనుండి తర్వాత వెయ్యేండ్ల పాలనలో బోధ చేయుటకు భూమిమీదికి వచ్చును.

నోవహు 120 సం॥లు ఓడను కట్టుటలోను, దేవునిగూర్చి ఇతరులకు చెప్పుటలోను ఉండెను. దేవుడు 120 సం॥లు ప్రజలు మారుమనస్సు పొందుటకు మాత్రమేకాక నోవహు బాగుగా సిద్ధపడుటకును, గొప్ప విశ్వాసిగా తయారగుటకును ఇచ్చెను. ఆలాగుననే ఇతరుల మారుమనస్సు నిమిత్తమే కాక పెండ్లికుమార్తె బాగుగా సిద్ధపడు నిమిత్తము కూడ ప్రభువు తన రెండవ రాకడ ఆలస్యము చేయుచున్నాడు. నోవహు విశ్వాసియైనను మరింత బలపడుటకు గడువిచ్చెను. ఆలాగే పెండ్లికుమార్తె సంఘ విషయముకూడ జరుగుచున్నది.

నోవహు నీతిపరుడు, నిందారహితుడు, దేవునితో నడచినవాడు. (ఆది. 6:9). ఒక మనిషినిగూర్చి మనమేమి అడుగుదుము. అతను ఎవరు? ఏమి పనిచేయుచున్నాడు?

అతడెటువంటివాడు? అని అడుగుదుము. దేవుడు లోకమంతయు పారజూచెను. ఒక్కడయినను మంచివాడు కనబడలేదు. ఒక్క నోవహు మాత్రము నీతిపరుడైయుండెను. దేవుడు ఏదైన గొప్పపని చేయించుటకు ఒక మంచి వానిని ఏర్పరచుకొనును. గాని ఒక్కొక్కప్పుడు చెడ్డవారినికూడ ఆయన ఏర్పరచుకొనును. ఎందుకనగా ఆ గొప్పపని అతనిమీద పెట్టినప్పుడే అతడు మార్పు చెందును.

నోవహు నీతిపరుడు, ఎక్కడ? తన ఎదుట తాను నీతిపరుడు. తన మనస్సాక్షి ఎదుట నీతిపరుడు. ఉదా:- ఒక దొరగారి దగ్గరనున్న బంట్రోతు బల్లమీదనున్న రూ. 200లు దొంగిలించెను. ఆ బంట్రోతునకు రాత్రంత నిద్రపట్టలేదు. అతనిలో ఇద్దరు మాట్లాడుచుండిరి. ఒకరు ఆ సొమ్ము ఇచ్చివేయుము అని, ఇంకొకడు వద్దు అని, అతడు మరుసటి ఉదయమున ఆ సొమ్ము దొరగారికి ఇచ్చివేసెను. అప్పుడు అతనిలోపల కలహముకూడా ఆగిపోయెను. మనసులో నెమ్మది కలిగెను. ఏ విశ్వాసియొక్క మనస్సాక్షి తన్ను గద్దించుటకు సందులేదో అట్టివారే ఎత్తబడే గుంపులో నుందురు. అనగా తన మనస్సాక్షికూడ తన్ను గద్దింపకుండు స్థితి ఎవరికున్నదో వారే పెండ్లికుమార్తె సంఘములోని వారైయుందురు. రెండవరాకడలోని వారు తమ స్వంత మనస్సాక్షికూడ గద్దించలేనంత పవిత్రమైన, స్థితిలో నుందురు. నోవహు తన మనస్సాక్షి యెదుట నీతిమంతుడు, మనుష్యుల యెదుట నీతిమంతుడు, దేవునియెదుట నీతిమంతుడు. దేవుడు నోవహుతో ఈ తరములో, నీవే నీతిమంతుడవని చెప్పెను. ఇట్టిస్థితి చదువరులు కలిగియుండు దీవెన ప్రభువు అనుగ్రహించును గాక! ఆమేన్.

# క్రీస్తు రక్షణ ఓడ

**"దేవుడు నోవహును అతనితోకూడ ఓడలోనున్న సమస్త జంతువులను సమస్త పశువులను జ్ఞాపకము చేసికొనెను. దేవుడు భూమిమీద వాయువు విసరునట్లు చేయుటవలన నీళ్లు తగ్గిపోయెను." (ఆది. 8:1).**

జలప్రళయము అనంతరము దేవుడు నోవహును జ్ఞాపకము చేసికొనెను. నోవహు 150 దినములు అనగా 5 నెలలు ఓడలో మూయబడి యుండుట ఒక విధముగా భయంకరమైనది. అయినప్పటికిని సంతోషమే. ఉదా: గాలితుఫాను వచ్చిన సమయమందు మనము ఇంటిలో తలుపువేసికొనియున్నాము. ఇల్లు చాలా బలమైనది. ఇంటి వెలుపల భయంకరమైన గాలి, శబ్దము మొదలగునవన్నియు నుండును. లోపలనున్నవారు అనుకొనునది ఒకటి. అదేమనగా నేను బలమైన ఇంటిలోనున్నాను. నాకేమి పర్వాలేదు అని అనుకొనును. గాలి తుఫాను ఒక దినము. రెండవ దినము, మూడవ దినము ఇంకా ఎక్కువ దినములున్నయెడల ఇంటిలోకూడ భయము కలుగును. విసుగుపుట్టును. ఎందుకనగా ఎక్కువ కాలము తుఫాను ఉండుటనుబట్టి మనకు గాలి వీచుచున్నది. దెబ్బతగులుననికాదు, ఇంటిలో సరుకులు లేవని కాదు, అన్ని ఉన్నను విచ్చలవిడిగా తిరుగుటకు వీలులేదు గనుక విసుగుదల పుట్టును. ఆలాగే నోవహు ఓడలో అన్ని ఉన్నవిగాని విచ్చలవిడిగా తిరుగుటకు వీలులేదు. ఎంత సౌఖ్యమున్నను ఒక విధముగా భయముండును, మేమెప్పుడు బయటికి వెళ్ళుదుమా, ఎప్పుడు మైదానం మీద సంచరింతుమా, ఎప్పుడు సూర్యుని చూచెదమా, ఎటుచూచిన నీళ్ళేయని తలంపులు వచ్చును. మనలను ఒక అడవిలో విడిచి పెట్టిన ఎట్టి తలంపులు వచ్చునో గ్రహింపగలము. వారికి మరియొక తలంపు పుట్టవలసినది కాని పుట్టలేదు. ఓడకు రంధ్రముబడిన దానిలోనికి నీరు వచ్చునని, దేవుడు నోవహును లోపలికి రమ్మని తలుపుమూసెను. లోపలికి రమ్మన్న దేవుడు బయటికి రమ్మనుట మరచిపోయినాడా? అని నోవహు భార్య

బిడ్డలు అనుకొనవలసినది, కాని వారట్లు అనుకొనలేదు. దేవుడు అయిదు నెలలు అయిన తర్వాత వారిని జ్ఞాపకము తెచ్చుకొనెను. ఇన్నాళ్ళు వారిని మరచిపోయినాడని కాదు, జ్ఞాపకము తెచ్చుకొనుచునే యుండును. అనగా ఇన్నాళ్ళు వారు ఓడలోనున్నారు. ఈ దినము వారిని బయటికి తెచ్చెదనని చెప్పినట్లున్నది. ఉదా:- ఒక తల్లి బిడ్డను ఇంటిలోపెట్టి తలుపు మూయును. అయితే ఆ బిడ్డ మాత్రము మా అమ్మ కొంత సేపటికి తలుపు తీయునుగదా అని అనుకొనును. కాని తల్లి ఎంతసేపటికి తలుపు తీయదు. ఇంక పిల్లకెవ్వన ఏడ్చుటకు సిద్ధముగా నుండు సమయములో తల్లి తలుపు తీసినది. ఆలాగుననే నోవహు స్థితియున్నది. పై ఉదహరణలో బిడ్డకు శిక్షగాని, నోవహునకు శిక్షకాదు. యింకా దేవుడు తలుపు తీయకుండ నున్నట్లయిన వారు దేవుని దూషింతురు. విసుగుకొందురు. వారు దూషింపకపోయిన, విసుగుకొనకపోయిన ఏదో ఒక ఆయాసము కలుగును. ఇది జరుగుటకు ముందే ఆయన తలుపు తీసెను. దీనినిబట్టి మనము నేర్చుకొనవలసినది దేవుడు ఎప్పుడు మనలను మరచిపోడు. ఇక మనము దేవునిని దూషింతుము అను సమయములో ఆయన మనలను విడిపించును. ఇది విశ్వాసుల స్థితి.

నోవహు ఓడలోనుండి కాకిని బయటికి పంపించినప్పుడు నేను కాకిని విడిచిపెట్టిన రీతిగా దేవుడు నన్ను ఓడలో నుండి విడిచిపెట్టునని తలంచవలెను. దేవుడు నోవహును జ్ఞాపకము చేసికొనెను. అనగా నోవహు యేసుప్రభువునకు ముంగుర్తు గనుక దేవుడు తన కుమారుడైన యేసుక్రీస్తుకు ముంగుర్తుగా యున్న వారిని జ్ఞాపకము చేసికొనక తప్పదు. నోవహు ఓడలో ఉండి కొండ ఎక్కెను. ఆలాగుననే యేసుప్రభువు చివరకు గొల్గొతాకొండ ఎక్కెను. సముద్రములో ఓడ మునిగిపోవునప్పుడు ఓడలోని వారు ఆ సంగతి కాగితముల మీద వ్రాసి సీసాలోపెట్టి సముద్రములో విడిచెదరు.

కెరటములు వాటిని ఒడ్డునకు చేర్చును. సముద్రము దేనిని తనలో నుంచుకొనదు. ఆలాగే కష్టములు వచ్చినప్పుడు అవి మనలను దేవుని దగ్గరకు నడిపించునుగాని అధోగతికి నడిపించవు. విశ్వాసుల విషయములో ఆలాగు జరుగును. కాని అవిశ్వాసుల విషయములో అధోగతి. దేవుడు నోహును జ్ఞాపకము చేసికొనెను.

యేసుప్రభువు పోలిక నోవహులో నుండెను. ఎవరైన తమ బిడ్డల పోలికగల ఇతరులను చూచిన వారి యందు ఇష్టము కలిగి ప్రేమింతురు. తమ బిడ్డలు చనిపోయిన యెడల వారి పోలికగల వారిని ఇండ్లకు పిలిచి సత్కరించుదురు. ఆలాగుననే మనలో క్రీస్తుప్రభువు పోలిక ఏదైన ఉన్నయెడల, అనగా ఆయనవలె శ్రమలు సహించుట. తండ్రి చిత్తము నెరవేర్చుట మొదలగు గుణములున్న యెడల దేవుడు తప్పక మనలను జ్ఞాపకముంచుకొనును. క్రీస్తు ప్రభువు శ్రమలను సహించెను నీచత్వము అనుభవించెను. తండ్రియొక్క చిత్తము తప్పక నెరవేర్తునని ప్రతిజ్ఞచేసెను. మనకు ఇట్టి లక్షణములుగలవో చూచుకొనవలెను. నోవహు ఓడ కట్టించెను. ఓడ చివరకు కొండ ఎక్కెను. ఆలాగే *క్రీస్తుప్రభువు సంఘమనే ఓడను కట్టుననియు, అది లోకమనే సముద్రమును దాటి రెండవ రాకడప్పుడు పరలోకమను కొండకు వచ్చుననియు దేవునికి ముందుగానే తెలియును.* ఇది నోవహునకును క్రీస్తునకును గల మరియొక పోలిక. తుఫాను అయిన తర్వాత ఎండను చూడగానే మనుష్యులకు సంతోషము కలుగును. సూర్యుడు తన కిరణములు భూమిమీదికి రానిచ్చినట్లు దేవుడు తన మహిమ కిరణమును విశ్వాసుల మీదికి కష్టముల తర్వాత రానిచ్చును. నిజ విశ్వాసులే రక్షణ ఓడ కథ ఎరిగినవారై క్రీస్తుప్రభువునందలి విశ్వాసముతో ఆయన రాకకు సిద్ధపడుదురు గాక! ఆమేన్.

Bible Mission HQ Guntur

# నోవహు నావ - రాకడ సిద్ధబాటు గుర్తు

**"మేఘములో నా ధనస్సును ఉంచితిని, అది నాకును భూమికిని మధ్య నిబంధనకు గురుతుగా నుండును" (ఆది 9:13).**

ఆది. 9 అధ్యాయము. నోవహు కుటుంబము ఓడలోనుండి బయటికి వచ్చిన తరువాత దేవుడు వారి దగ్గరకు వచ్చి వారితో ఈలాగు చెప్పెను. "మేఘములో నా ధనుస్సు ఉంచితిని. అది నాకును భూమికిని మధ్య నిబంధనకు గుర్తుగా నుండును". దీనిలోని సంగతులు:- 1) ధనుస్సు 2) మేఘములు 3) నిబంధన 4) గుర్తు. ఈ మాటలకు అర్ధములు గలవు. మరి రెండు మాటలు. (1) భూమికిని (2) నాకును

1) మేఘము:- మేఘము చేయు మొదటి పని సూర్యుని కనబడకుండ చేయును. మరియు పొలములోనున్న వారు మేఘమును చూచి వర్షము వచ్చునని భయపడి ఇంటికి పోవుదురు. ఆలాగే జబ్బు వచ్చినప్పుడు, రాక రాక జబ్బు వచ్చినది, వదులుట లేదు. తుదకు నన్నేమిచేయునో అను మేఘము కమ్ముకొనును. మనిషి అధైర్యపడును. వ్యాధి, శోధన, కష్టము, ఇబ్బంది మొ॥నవి వచ్చినప్పుడు ఇట్టి మేఘము కమ్మును. వ్యాధిలోనున్నవారు రాత్రి సమయములో భయపడి ఎప్పుడు తెల్లవారునా, ఎప్పుడు సూర్యుని చూతుమా అని అనుకొందురు. తెల్లవారగానే ధైర్యము కలుగును. ఒక కష్టము వచ్చినప్పుడు ఒక రకమైన మేఘము మనలను ఆవరించును. కష్టము వలన కలిగిన ఆంధోళన మేఘమువలె ఆవరించును. ఇట్టి కష్టములు కలిగినప్పుడు లెక్కచేయని యెడల మేఘము మనుష్యుని ఆవరించదు. జబ్బు, నింద, పాప శోధన వీటన్నిటివలన అధైర్యము కలిగిన యెడల అది దట్టమైన మేఘమువంటిది, వాటివలన కలిగిన ఆంధోళనయే నల్లని మేఘము.

2) వర్షము:- జబ్బు, కష్టము ఎక్కువైన యెడల చివరకు ఏడ్పువచ్చును. కంట నీరు వచ్చును. ఇదియే ఒకరకమైన వర్షము. ఇట్టి వర్షము కురిపించుట దేవునికి ఇష్టము. ఎందుకనిన ఇట్టి పరిస్థితి వచ్చినప్పుడే మనిషి దేవుని తట్టు తిరుగును. భయమనే నల్లని మేఘము, పశ్చాత్తాపమను కన్నీళ్ళ వర్షము కురిపించును. ఈ రెండు అయిన తర్వాత మనిషి బాగుపడును. బాగుగా ఏడ్వనిచ్చి తర్వాత దేవుడు ఆదరించును. మబ్బుపోయిన తర్వాత సూర్యకాంతి (ఎండ) వచ్చును. కష్టము, బాధపోయిన తర్వాత క్రీస్తుప్రభువు యొక్క ముఖబింబమును చూడగలము. మబ్బులో సూర్యుని చూడలేము. ఆలాగే కష్టములలో ప్రభువుని చూడలేము. ఆ కష్టములు తీరిన తర్వాత చూడగలము. నీతి సూర్యుడైన ప్రభువుయొక్క కాంతి, కష్టముల తర్వాత చూడగలము.

మరియు దేవుడు తన ముఖమును కుమారునిలో చూపించెను. తుఫాను అయిన తర్వాత ఎండను చూడగానే మనుష్యులకు సంతోషము కలుగును. తుఫాను తర్వాత సూర్యకిరణములు భూమిమీద పడునట్లు దేవుడు తన మహిమ కిరణములను భూమిమీదికి రానిచ్చును. మేఘము, వర్షము, సూర్యుడు- ఇవన్నీ అయిన తర్వాత ధనుస్సు కనబడును. ధనుస్సు అనగా వాగ్దానము, నిబంధన. అయితే నిబంధనకు ఇద్దరుండవలెను. పెండ్లిలో యిరుపక్షములవారు మాట్లాడుకొన్న తర్వాత గుర్తుగా ఏదో ఒక వస్తువు పెండ్లికూతురునకు ఇచ్చెదరు. అలాగే దేవుడు యూదుల ద్వారా లోకమునకు ఒక గుర్తు ఇచ్చెను. ధనుస్సు ద్వారా లోకమునకు నిబంధన ఇచ్చినట్లు యూదుల వంశములోనుండి లోకమునకు రక్షకుని పంపెను. ధనుస్సు చూడగానే దేవుడు దయగలవాడు అని

జ్ఞాపకము వచ్చినట్లు, ప్రభువును తలంచగానే దేవుడు దయగలవాడు. తన కుమారుని ద్వారా నా పాపములు క్షమించి, నన్ను రక్షించెనని జ్ఞాపకముండవలెను. ఇది కృపా నిబంధనకు గుర్తు. యూదులు పాపము చేసినప్పుడు తండ్రివలె వారిని శిక్షించెనుగాని నిబంధన కొట్టివేయలేదు. ఇశ్రాయేలీయులను శిక్షించి వారిలోనుండి రక్షకుని రప్పించెను. ఆలాగుననే దేవుడు విశ్వాసులను శిక్షించునుగాని రక్షణ మాత్రము తీసివేయడు. మనిషి తనంతట తాను రక్షణ తీసికొనవచ్చును గాని దేవుడు తీసివేయడు. మనిషి పాపముచేసి దేవుడు నన్ను రక్షించడని అవిశ్వాసపడి తన రక్షణ తానే పోగొట్టుకొనును. నిబంధన తనంతట తానే కొట్టివేసికొనును. మనుష్యునికి రక్షణ పోవుట పాపము వలన కాదుగాని, తన అవిశ్వాసము వలననే, నమ్ముటవలన *నిబంధనలోనికి రావడము జరుగును. నమ్మకపోవడము వలన నిబంధనకు దూరమగుట జరుగును. అట్లు దూరమైనను మరల విశ్వాసము కలిగించుకొని నిబంధనలోనికి రావచ్చును.*

ధనుస్సునకు దేవుని ధనుస్సు అని గొప్ప బిరుదుగలదు. దీనిపని గురుతుగా నుండుట. ఇది దేవుని నిబంధనకు గుర్తుగా నున్నది. నోవహు కాలము మొదలుకొని మనకాలము వరకు లోకమంతటిని ముంచివేయు వర్షము రాలేదు. గనుక తండ్రి చెప్పిన మాట నెరవేరినది. అక్కడక్కడ వర్షము వచ్చి కొన్ని గ్రామములు పోవుట, *మనుష్యులు జీవరాసులు నశించుట నిజమేగాని, మనుష్యులందరు, జీవరాసులన్నియు నశించే భూలోక వరదరాలేదు.* బైబిలు నిజమైన గ్రంథమని తెలిసికొనుటకు ఇది ఆధారము. ఆది. 6:7లో నరులను, జంతువులను పురుగులను తుడిచివేతునని

యున్నది. అది నోవహు కాలములో జరిగెను, ఇకను జరుగదు. ఇది బైబిలు నిజమైన గ్రంథమని ఋజువు పరచుచున్నది. ఈ నిబంధన– నిత్యనిబంధన అని వ్రాయబడియున్నది. ధనస్సు దేవునికి, లోకమునకును నిబంధన గుర్తు. ఇది మేఘములలో కనబడును. ఇది వర్షము తరువాత కనబడునని మన అనుభవములో నున్నది. దీనినిచూచి దేవుడు తన నిబంధనను జ్ఞాపకము చేసికొనును. దీనిపేరు 1. ధనస్సు:– దేవుని ధనుస్సు. 2. ధనస్సు:– నిత్యనిబంధన జ్ఞాపకము చేయునది. 3. ధనుస్సు:– దేవుడు నాశనము చేయడు అనే నిబంధన జ్ఞాపకము చేయును గనుక దేవుడు, మనిషికూడ జ్ఞాపకము చేసికొనవలసినదే. మనమేమి జ్ఞాపకము చేసికొనవలెననగా లోకమునకు నీటివలన నాశనము రాదు. ధనుస్సుయొక్క స్వరము నీటివలన భూమికి నాశనమురాదు నరులు ఈ సత్యము నమ్మిన యెడల నీటివలనగాని, మరి దేనివలనగాని నాశనమురాదు, నాశనము రాదనుటయే మొదటి సువార్త.

యాకోబు అతని అన్న అయిన ఏశావును విడచి దూరముగా పారిపోయినాడు. 20 సంవత్సరములకు తిరిగివచ్చుచు అన్నకు 7 మార్లు నమస్కరించెను. (ఆది. 33:3) అన్నయొక్క ప్రేమను తనపై కలిగించుకొనుటకు యాకోబు ఆలాగు చేసెను. చివరకు ఇద్దరు ఎదురైనారు, కౌగలించుకొనుచున్నారు. ఆలాగే మనమును దేవుని ప్రేమను సంపాదించుకొనుటకు దినమునకు అనేకమార్లు దేవునికి నమస్కారము చేయుచుండవలెను. క్షమాపణ 7 మార్లుకాదు 77 మార్లు అని ప్రభువు పేతురుతో చెప్పెను. అలాగే నోవహు కాలములో 7 రంగుల ధనస్సుతో దేవుడు నిబంధన చేసెను. అది దేవుని దయ. ప్రభువు పత్మసు లంకలో యోహానుకు 7 సంఘములను గురించి చెప్పెను. ఒక్కొక్క సంఘములో ఒక్కొక్క రకమునకు సంబంధించిన

భక్తులు ఉందురు. ఎఫెసు మొదటి సంఘము చివరిది లవొదికైయ సంఘము. చివర ప్రభువు సింహాసనము ఉండును. వేలతరబడి భక్తులు ఈ సంఘములలో నుందురు. భక్తి యొక్క అంతస్థులలో తేడాలుండును. ఓడలోనికి అందరు ఏలాగు రాలేదో, ఆలాగే అందరు సంఘములోనికిరారు. ఒకవేళ వచ్చిన, వారందరిలోను అనేకులు అవిశ్వాసులుందురు. అందువలననే క్రైస్తవులలో చాలమంది భక్తులలో చేరుట లేదు. అనగా ముందు శక్తి పొందవలెను. గనుక ముందు ఆత్మను పొందిన తర్వాత శక్తి వచ్చును. భక్తులుకూడ 7 రకములు. ఉదా: బడివేళకు అన్ని ఇండ్లలోనుండి పిల్లలు రోడ్డుమీదకువచ్చినగాని, బడిలో ఎవరి తరగతిలో వారు సర్దుకుంటారు. అలాగే భక్తులుకూడ 7 తరగతులలోనికి వెళ్ళుదురు. ఈ 7 తరగతుల వారు ప్రభువు సింహాసనము దగ్గర ఉందురు.

పరలోకమునకు వెళ్ళిన తర్వాత ఈ ఏడింటిలో నీవు ఏ తరగతిలోనున్నది నీకెవ్వరును చెప్పరు. ఎవరు ఏ తరగతికి వెళ్ళవలెనో ఎవరంతట (వారి అంతరంగస్థితి) వారికే తెలిసిపోవును. భూలోక జీవితములో ఎన్నిమెట్లు ఎక్కుదురో పరలోకములోకూడ ఆ తరగతిలోనే ఉందువు. ఒక్కొక్క తరగతిలోను కాంతికూడ వేరువేరుగా నుండును. మెట్లు ఎక్కుకొలది కాంతి ఎక్కువగానుండును. ఒకరు ఎక్కినమెట్టు మరియొకరు ఎక్కవలెనంటే శక్తి చాలదు గనుక ఎక్కలేరు. ప్రతివాడు తన వరుసలో బ్రతికింపబడును (1కొరింథి. 15:23). 7వ మెట్టు నూతన యెరూషలేము. భూలోక సంఘములో భక్తిలో ఏ మెట్టులో నుందువో పరలోకములో అదే మెట్టులో నుందువు. దేవుడు నోవహుతో నిబంధన చేసెను. యోహానుతో నిబంధన, 7 సంఘముల స్థితిని చూపించెను. తరగతులు 7, అంతస్థులు 7, ధనస్సు ఒక్కటేగాని రంగులు 7. వారము ఒకటేగాని దినములు 7, యాకోబు ఒక్కడేగాని నమస్కారములు 7. ధనస్సు తెలియని వారుండరు. ఆలాగే ప్రభువుని ఎరుగనివారు కూడ ఉందరు. రంగులు చూడగా సూర్యుడును, దేవుడును,

జ్ఞాపకమునకు వచ్చును. ఆకాశములో సూర్యుడును, మోక్షములో నీతి సూర్యుడైన యేసుప్రభువు ఉన్నారు. ఆ ఓడలో లేనివారు ఓడ బైట నీటిలో మునిగి నశించిరి. ఆలాగే ఈ లోకములో ఉన్న ప్రతివారు 7 సంఘములలో ఏదో ఒకదానిలో చేరవలెను. లవోదికయ సంఘ అంతస్థు ఎక్కువ అట్టి అంతస్థుకు సిద్ధపడుదురు గాక! ఆమేన్.

# సమాజముగా కూడుకొనుట-I

## (సంఘము)

*వాక్యము:- 'కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి ఎక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతము.' హెబ్రీ. 10:24-25.*

**ప్రార్థన:-** వాక్య దానకర్తవైన ఓ తండ్రీ, వాక్యముద్వారా వర్తమానము అందించుము. సారాంశము హృదయ నేత్రములకు కనబడునట్లు నీయాత్మతో మమ్మును నింపుము. మా జ్ఞానమును నీ యాత్మతో వెలిగించుము. అప్పుడు అద్భుత విషయములు గ్రహించగలము. నీ ఆత్మతో మా మనస్సాక్షిని శుద్ధీకరించుము, అప్పుడు నీ వాక్యప్రకారము నడుచుటకు ఇష్టము పుట్టును. కూడియున్న ఒక్కొక్కరికిని వర్తమాన మందించుము. నీ వాక్యము మాకు విడచెప్పుము. మర్మమైన విషయములు బయలు పరచుము. ఈ మా ప్రార్థన నీ కుమారునిద్వారా అంగీకరించుము. ఆమేన్.

అపోస్తలుడైన పౌలుగారు పై వాక్యమును ఒకటవ శతాబ్దములో వ్రాసిరి. ఇప్పుడు మనము 21వ శతాబ్దములోనున్నాము. ఇన్ని శతాబ్దములలోను సంఘమున్నది. ఆ మొదటి

శతాబ్దములలోనున్న ఆది సంఘములో బలహీనులు గలరు. వారు సమాజముగా కూడుట మానివేసిరి. ఇప్పుడు కూడ ఈ 20వ శతాబ్దములోకూడ సమాజముగా కూడుట మానివేయుచున్నారు. అక్కడనున్న లోపము ఇక్కడకూడనున్నది. సంఘము అన్ని శతాబ్దములలోను మీటింగులు ఏర్పాటుచేయుట క్రొత్త పద్ధతుల ప్రకారము సేవచేయుట గలదు. 1. ఆదివారము అందరు గుడికి రావలెను. 2. వారములో ఏదోయొక దినమందు కూడుకొనవలెను. 3. పండుగలలో కూడుకొనవలెను. 4. సువార్త ప్రచార సమయములలో కూడుకొనవలెను. ఇదికాక ఇంకా ప్రత్యేక సమయములు గలవు. సమాజముగా కూడుకొనుట వీలుప్రకారము చేయవలెనుగాని సిద్ధాంత ప్రకారముకాదు. గ్రామములో వ్యాధులున్న కూడుకొనవలెను, యుద్ధములు జరుగునప్పుడుకూడ కూడుకొని ప్రార్థింపవలెను. సంఘము కూడుకొనుటలేదని పౌలు వ్రాయలేదుగాని, కొందరు కూడుకొనుట మానుకొనుచున్నారని వ్రాసెను. ఇద్దరు ముగ్గురు కూడుకొనవచ్చునని ప్రభువు చెప్పెను. ఆ కూడుకొనని వారికోసము సంఘము ఆగలేదు గాని, కొందరు ఆగిపోయినందుకు పౌలునకు ఆయాసముగా నుండెను. వారు మానినట్లు మీరు మానవద్దని సలహాలిచ్చుచున్నాడు. (1) మానివేయవద్దు, (2) కూడుకొనండి అని రెండు గొప్ప సలహాలు ఇచ్చుచున్నాడు. కూడుకొనుటలో ఉద్దేశములు బేధము కావచ్చునుగాని కూడుకొనుట మాత్రము ఒకటే. కొందరు ఎందుకు మానుకొనుచున్నారు? కారణముల జోలు మనకక్కరలేదుగాని కూడుకొనుట మన గురియై యుండవలెను. 1. కూడుకొనవలెను. 2. ఎక్కువగా కూడుకొనవలెను. ఎంత ఎక్కువగా కూడుకొనిన అంతమేలు. రానైయున్న ప్రభువు రాకడ

సమీపించుకొలది ఎక్కువగా కూడుకొనండి అని హెచ్చరించెను. ఒక్క అరగంటయైన కూడుకొనిన చాలును, అది ప్రభువుతోనున్న సంఘము. మనము రాకడ సమీపించుకొలది సామాన్యముగా కూడుకొనుటకంటె ఇంకా ఎక్కువగా కూడుకొనవలెను.

1వ శతాబ్దము వారికి రాకడ తలంపు ఉన్నది. 21వ శతాబ్దములోనున్న మనకు రాకడ తలంపు గలదు. గురుతులు జరుగుకొలది 1. సామాన్య కూటములు ఎక్కువగా చేయవలెను. 2. వృద్ధి కూటములుకూడ చేయవలెను. వృద్ధి కూటములలో రాకడ సంగతులు జ్ఞాపకము చేసికొనవలెను. వాక్యములో లేకపోయినను తరచుగా కూడుకొనవలెనని పౌలు ఉద్దేశమును, వాక్య ఉద్దేశమునైయున్నది. పౌలు కాలములోనే రాకడ తలంచుకొనవలెనంటే, మనము ఇంకా రాకడ దగ్గరనున్నాము గనుక మనమెక్కువగా కూడుకొని కూటములు చేయవలెను. అనేక పర్యాయములు నిరుత్సాహము కలుగును. మన గురి రెండవ రాకడ గనుక ఎక్కువగా కూడుకొనవలెను.

ఒకరినొకరు హెచ్చరించుకొనవలెనని వాక్యములో గలదు. పట్టణములలో గంటకొట్టిన కూటములకు వస్తారు అదే ప్రేరేపణ, గ్రామములలో పిల్లలు ఇంటింటికి వెళ్ళి గుడికి రమ్మని చెప్పుదురు. తర్వాత సంఘపెద్దలు ఇంటింటికి వెళ్ళి వారిని రమ్మని ప్రేరేపించెదరు. ఈలాగు ప్రేరేపించుట ఆరంభమునుండి గలదు. కొన్నిచోట్ల శనివారము రాత్రి ఇంటింటికి గంట మ్రోగించే అలవాటుగలదు. కొన్నిచోట్ల వీధుల గుండ కొందరు కలిసి కీర్తనలు పాడుకొనుచు వెళ్ళుదురు. ఈ రీతిగా కూటములకు వచ్చుటకు ప్రేరేపణలు

ఆదినుండి గలవు. నలుగురితో కలిసి కీర్తనలు పాడుట, ప్రార్థనలు చేయుటవలన మనసునకు శాంతి కలుగును. విచారము తగ్గునని కూటములు చేసికొందురు. 1. తరచుగా కూటములు పెట్టుట. 2. అనేకులను ప్రేరేపించుట మానకూడదు. పౌలు కాలములో ప్రేరేపించు పనిగలదు. కూటములు మానుకొనువారు మనకు మాదిరికాదు. తరచుగా కూడుకొనువారు మనకుమాదిరి. దేవునికృప తరచుగా కూడుటకును, ప్రేరేపించుటకును తోడైయుండును గాక! మరియు వాక్యములో 1. ప్రేమ చూపుటకు 2. సత్కార్యములు చేయుటకును అని గలదు. ఇక్కడ రెండు రకముల మీటింగులు, (1) మానుకొనే మీటింగు, (2) కూడుకొనే మీటింగు. ఈ రెండు రకముల ప్రేరేపణలు రండి అనే ప్రేరేపణ, ప్రేమ వృద్ధిచేసికొనండి, మంచి కార్యములు చేసికొనండి అనే ప్రేరేపణకు వచ్చినాము గనుక ఒకరినొకరము ప్రేమించుకొనవలెను. వారు వీరిని వీరు వారిని ప్రేమింపవలెను. చెడుగు చెప్పుకొనుట, అల్లరిచేయుట కాదుగాని, రాకడనుగూర్చి తెలిసికొనుటకు, ఆ ప్రేరేపణ కలుగుటకు రావలెను.

**కూటములవలన ఉపకారములు:-** ప్రేమ వృద్ధియగును, సంభాషణవల్ల సంతోషము వృద్ధియగును మంచికార్యములు చేయుటయందుకూడ ఆ వృద్ధి కనబడును. ప్రేమ స్వభావము తెలియవలెను. ప్రేమ ఉన్న వృద్ధి కలిగించుకొనవలెను. ప్రేమ పనులు వృద్ధికావలెను. ఇవి బోధకుని బోధలో నుండును గనుక మీటింగులకు హాజరు కావలెను. ప్రేమవృద్ధి, మంచిపనుల వృద్ధి, రాకడ తలంపుల వృద్ధి వీటికి కారణము తరుచుగా కూడుకొనుట. వాక్యము చివర 'ఆలోచింతము" అని ఉన్నది, ఇది ముఖ్యమైనది. అందరు కూడుటవల్ల

పద్ధతులు ఆలోచించగలము. ప్రేమ తగ్గినది వృద్ధియగుటకు ఏమిచేయవలెను? గనుక వృద్ధియగు పద్ధతులు ఆలోచించుటకు కూడుకొనుట అవసరము. క్రొత్త బోధలు, క్రొత్త అనుభవములు కూడుకొనుట వలన కలుగును. గనుక వాక్యము వినువారమైన మనము సాధ్యమైనంతవరకు ప్రతిదినము కూడుకొని దేవుని వాక్యమును పఠించి, ధ్యానించి ఆయన రాకడకు సిద్ధపడుదుముగాక! ఆమేన్.

# సమాజముగా కూడుకొనుట

## (క్రైస్తవ కుటుంబము)

**వాక్యము: "యేసు వచ్చినప్పుడు పండ్రెండుమందిలో ఒకడైన దిదుమ అనబడిన తోమా వారితో లేకపోయెను." యోహాను 20:24-29**

ప్రభువు శిష్యులు కూడుకొనిన కూటమునకు తోమా రాలేదని శిష్యులు మీటింగు కట్టివేయలేదు. ఎవరు రాకపోయినను మనము కూటములు జరుపుకొనవలెను. వారు తోమా కొరకు కనిపెట్టిన యెడల 8 దినములు ఆలస్యమగును. రానివారి నిమిత్తము కూటము ఆపుజేయకూడదు. కొద్దిమంది ఉన్నను కూటము జరుపవలెను. ఆదివారము సాయంత్రము ప్రభుని చూచిన శిష్యులు తోమాతో ప్రభువు మాకు కనబడెనని చెప్పినప్పుడు తోమా నమ్మనన్నాడు. కూటమునకు రానని చెప్పినాడు రాలేదు. అటువంటి తోమానువారు తీసికొనివచ్చినారు. మనమును ప్రతి ఆదివారము ఎవరినో ఒకరిని సంఘమునకు (సంఘకూటమునకు) తీసికొని రావలెను.

పూర్వకాలములో సొదొమ గొమొఱ్ఱాల పట్టణములలో పాపము ఎక్కువాయెను. ఆ పట్టణమును కాల్చి నాశనము చేయుటకు దేవదూతలు వచ్చిరి. ఆ పట్టణపు పాపము అంచులమట్టుకు నిండియుండెను గనుక పాపులమీదికి కీడురానైయున్నది. అక్కడ 'లోతు' అను దైవభక్తుడున్నాడు. దేవుని ఉద్దేశము ఆయనను

తప్పించవలెను. దేవుని ఉద్దేశము దైవభక్తుడు ఎంతకాలము బోధించినను ఆ పట్టణపువారికి ఎక్కలేదు. దేవుని నిర్ణయము చొప్పున ఈ దూతలు ఆ పట్టణమును నాశనము చేయుటకు వచ్చిరి. దైవజనుడైన లోతు వారిని ఇంటికి రమ్మని పిలిచెను. గాని వారు మేమురాము నడివీధిలో రాత్రి గడుపుతామని చెప్పిరి. ఆ పట్టణపువారు దుర్మార్గులు గనుక వారిని చంపివేస్తారని లోతువారిని తన యింటిలోనికి రమ్మని చెప్పెను. ముందువారు 'రాము' అని చెప్పిరిగాని బలవంతముచేయగా వెళ్ళిరి. ఊరు వారందరు లోతు ఇల్లుముట్టడిచేసి, వారిరువురిని బయటికి పంపుమని కేకలువేసిరి. అప్పుడు లోతువారికి బోధచేసెను. గాని వారు అతనిమాటలు వినలేదు దూతలు లోతును లోపలికిలాగి తలుపువేసిరి. ఆ ఊరి వారందరు తలుపు బ్రద్దలు చేయబోవుచుండగా వారికన్నులు గ్రుడ్డి వాయెను. దూతలు లోతు కుటుంబమును పారిపొమ్మని చెప్పెను. వారి బంధువులనుకూడ తీసికొని పొమ్మని చెప్పెను. లోతు అల్లుళ్ళు ఆ మాటలన్ని వెర్రి మాటలని త్రోసివేసిరి. ఈ అల్లుళ్ళు మామ వద్దకు వచ్చి మేము రాము అనివారితో చెప్పిరి. దూతలు లోతును, అతని భార్యను, ఇద్దరు కుమార్తెలను నలుగురిని పొలిమేర దాటించిరి. వీరు వెళ్ళిన స్థలము రక్షణస్థలము. అక్కడ హానిరాదు. అగ్ని గంధకము అక్కడ కురువదు. సొదొమ నాశన స్థలము. అయితే రక్షణ స్థలమునకు అల్లుళ్ళు రామని చెప్పిరి. వారు వచ్చేవరకు లోతు ఉండక పోయినాడా? వారెందుకు ఆగలేదు? అట్లు ఆగడమువలన వీరుకూడ కాలిపోవుదురు. నాశనస్థలమునుండి రక్షణ స్థలము చేరునప్పటికి అగ్ని గంధకమువచ్చి అన్నిటిని కాల్చివేసెను.

మనమును వాక్యము వినుటకు సంఘమునకు (లేక) కూటములకు రమ్మని అనేకులను పిలువవలెను. లోతు బోధించినను అల్లుళ్ళు వినలేదు. అలాగే విననివారు, లోబడనివారు అనేకులు ఉంటారు. అయినను చెప్పుట మనవంతు, అయితే మనము చెప్పినప్పుడు అల్లుళ్ళలాంటి వారు రారుగాని, తోమాలాంటివారు వస్తారు. తోమా ముందు రానన్నాడుగాని తర్వాత వచ్చెను అలాగే

కొందరు ముందుకురాము అని చెప్పిన తర్వాత వస్తారు. మనము చెప్పితే రక్షణ స్థలమునకు వచ్చేవారున్నారు, రానివారుకూడ ఉన్నారు. మనపని మనము చేయుచుండవలెను. వారు రక్షణ స్థలమునకు వచ్చిన మనకు సంతోషము, రాకపోతే విచారము, మన ప్రాణమున్నంత కాలము చెప్పవలెను. ఎవరు రాకపోయినను మన ప్రార్థనలు, కీర్తనలు, కూటములు మానరాదు. వీరు నలుగురు రక్షణ స్థలమునకు ప్రయాణమై పోవుచున్నారు. దూతలు పరలోకమునకు వెళ్ళిరి. వీరందరు పోవుచుండగా రక్షణ స్థలమునకు చేరకముందే లోతుభార్య వెనుకకు తిరిగిచూచెను. అయ్యో నా ఇళ్ళు, సామాను, అల్లుళ్ళు, వాటిపైన ఆశ ఉండి వెనుకకు తిరిగి చూచెను. వెనుకచూపు గలవారున్నారా? జాగ్రత్త! వెనుకకు వెళ్ళేవారికి లోతుభార్య పాఠము చెప్పుచున్నది.

1. రక్షణ స్థలమునకు వెళ్ళేవారికి లోతు, ఆయన ఇద్దరు కుమార్తెలు పాఠము నేర్పుచున్నారు. 2. అసలు రానివారికి అల్లుళ్ళు పాఠము నేర్పుచున్నారు. 3. వెనుకతిరిగి చూచేవారికి లోతుభార్య పాఠము నేర్పుచున్నది. ప్రభువు దగ్గరకు వచ్చిన వారు తిరిగి వెనుకకు పోరాదు. అగ్ని పట్టణముమీదికి రాగానే శబ్దమాయెను. భార్య వెనుకకు తిరిగి చూచి నాశనమాయెను. చివరివరకు వెళ్ళినవారే రక్షింపబడుదురు. సంఘము రక్షణ స్థలము. ఎన్ని కష్టములు వచ్చినను అక్కడికే పోవలెను. ఎవరు పిలువకుండానే ఆమె వెనుకకుచూచి నాశన మాయెను. ఆమె పట్టణముతట్టు ఆకర్షింపబడెను. ఆమె దూతలమాట విని సగము దూరము వచ్చెను. గనుక ఆమె భక్తురాలేగాని అగ్ని కురిసేటప్పటికి ఆమె సొదొమ పట్టణస్థులలో చేరెను. భక్తురాలు వెనుకచూపు వలన నాశనమాయెను. వెనుకచూపు హాని! ఆ పట్టణము మీద దేవుని మహాకృప ఉన్నది. ఏలాగు తెలియుననగా దూతలు నాశనము చేయుటకు వచ్చినామని చెప్పినప్పుడు ప్రభువా! రక్షించు అని ప్రార్థన చేసినట్లయిన సొదొమ రక్షణ స్థలము అయిపోవును. గాని అట్లు ప్రార్థన చేయక కొట్టవచ్చిరి. గ్రుడ్డివారైనప్పుడైయినా అనవలసినది, గాని వారు సర్దినదే సర్దుచుండిరి. కనుక దూతలు వారిని చేతులు పట్టుకొని లాగుకొనివచ్చిరి. వారి నలుగురి 8 చేతులు వీరిద్దరివి (దూతలు) 4

చేతులుకాని వారు పట్టుకొనిరి. నశించు వారిమీద కూడ దేవుని దయ ఉండునని లోతు భార్యనుబట్టి తెలిసికొను చున్నాము. లోకముపుట్టి 6వేల సం॥ము అయినది. యేసుప్రభువు త్వరగావచ్చి సిద్ధపడినవారిని పరలోకమునకు తీసికొనివెళ్ళును! ప్రభువు ఇంకారాలేదేమిటి అనగా అక్కడక్కడ దైవభక్తులు కొన్ని కష్టములలో నున్నారు, వారు రక్షణ చోటికి రావలెనని ఉన్నారు గాని కొన్ని అడ్డులున్నవి ఏలాగంటే దేవుని ఉగ్రత సొదొమపై రాకపూర్వము ఇంకా లోతు రక్షణ స్థలమునకు వెళ్ళలేదు. గనుక గంధకము కురువలేదు. కాని రాకడ (వధువు) సంఘము వెళ్ళిన తర్వాత భూమిమీదికి ఏడేండ్ల శ్రమలు వచ్చును. చదువరులు ఇట్టి శ్రమను తప్పించుకొందురు గాక! ఆమేన్.

# కృపాకాలము

**వాక్యము:- "కృపమీకు తోడైయుండునుగాక" కొలస్స. 4:18.**

మనము ఇప్పుడు కృపాకాలములో జీవించుచున్నాము. ప్రకటన గ్రంథములో కృపాకాలముయొక్క ముగింపును గురించి వ్రాయబడి యున్నది. లోకము, సంఘము ఇంకను ఈ కాలము అనుభవించుచున్నది. మానవులు బలహీనులని చెప్పి దేవుడు కృపా కాలమును చాల దీర్ఘ కాలముగ చేసియున్నాడు. అందుచేతనే మానవుడు ఈ కాలమును నిర్లక్ష్యము చేయుచున్నాడు. కృపాకాలము మారుమనస్సు పొందుటకు అనుగ్రహింపబడిన కాలము. కాబట్టి సంతోష కాలమైయున్నది. అయినప్పటికిని కృపాకాలములో శిక్షకూడ మిళితమైయున్నదని కనబడుచున్నది. అట్టి శిక్షకూడ కృపయొక్క లెక్కలో చేర్చవలసినదే. గనుక కృపకాలమునువలె, శిక్ష కాలమును కూడ గౌరవము చేయవలెను. లోకమును కలుగజేయకముందు కాలమనునది లేదు. అది అనాదియైయుండెను. దేవుడు లోకమును కలుగజేసినప్పుడు వెలుగు, చెట్టు, జీవరాసులను, మనిషిని వీరితో

పాటు కాలమును కూడ కలుగజేసెను. ఒకరు చెప్పినట్లు కాలమనునది నిత్యత్వములోని ఒక రేణువైయున్నది. అట్టి నిత్యత్వములో ప్రవేశించుటకు ముందు, కృపా కాలమును అనుభవించవలెను, లేని యెడల నిత్యజీవము దొరకదు. భూలోక జీవితకాలమును దేవుడు మనకు నియమించుటలో ఆయన యొక్క అపరిమితమైన ప్రేమ కనబడుచున్నది. ఈలోక జీవనము అనవసరమనియు, సంసారమే సాగరమనియు, ఈలోక జీవితమువల్ల పాపాల పాలు కావడము మాత్రమే కాక మరేమియులేదని అనునట్టివారు దేవుని కృపను గ్రహించలేదని మనము తెలిసికొనవలెను.

సృష్టియొక్క మొదటి దినము మొదలు లోకాంతముయొక్క చివరి దినము వరకు ఎన్ని పాపములతో, ఎన్ని శ్రమలతో నిండియున్నను అది కృపకాలము కాకపోదు, ఉపయోగమైన కాలము కాకపోదు. ఒక గొప్ప నదిలో ఒక చీమ పడినంత మాత్రమున ఆ నీరు త్రాగమని ఎవరందురు. ఆలాగే దేవుడు మన నిమిత్తమై దాచి ఉంచిన జీవామృతధారల యెదుట మన కష్టములన్నియు కలిపి చీమంత ఉండును. కృప కాలమును, అందలి శిక్ష కాలమును తృణీకరించువారు కృపకాలమును విడిచిపెట్టువారగుదురు. కృపకాలము లోనికి నడిపించునట్టి శిక్ష కాలమును విడిచిపెట్టుచు నిత్యనాశన కాలములో పడిపోవుదురు. మరియు కృపకాలమును, శిక్ష కాలమును సమానముగా భావించువారు నిత్యజీవకాలమున ప్రవేశింతురు. అప్పుడు శిక్ష కాలముయొక్క ఉపయోగమును తెలిసికొందురు. ఎంత గొప్ప పాపియైనను, ఎంత మారుమనసు లేనివాడైనను, తెలిసియు ఎన్నోమార్లు పాపము చేయువాడైనను,

దేవునిని ఏ మాత్రమును నామకార్థముగా నమ్మనివాడైనను, నాకు కృపలేదు అనుటకు వీలులేదు. అతడు సంవత్సరములు లేవు నెలలు లేవు, గంటలు, నిమిషములు లేవు అని అనగలడా? అనలేడు గనుక కృపకూడ లేదని అనలేడు. ఎందుకనగా ఇవన్నియు కృప కాలములై యున్నవి. గనుక ప్రతి నిమిషము కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసినదే. మనకు శక్తి ఉన్నయెడల అట్లు స్తుతించుట గొప్ప బలమైయుండును.

దేవుని లక్షణములలో ఏది గొప్పదని కొందరు అడుగుచున్నారు. అన్నియు సమానమే. కృపగొప్పదే, శిక్షించే న్యాయము గొప్పదే రెండు అవసరమే. రెండును మన నిమిత్తమే. దేవుని లక్షణముల విషయములోను, ఆయన క్రియల విషయములోను తారతమ్యము (భేదముచేసి) మాట్లాడరాదు నాకు కృప సరిపడలేదు అని ఏ పాపియైనను దేవునిమీద పిర్యాదు చేయుటకు సందు లేదు, అప్పుడే పుట్టి అప్పుడే చనిపోయిన శిశువు సైతము నాకు కృప చాలలేదు అనుటకు వీలులేదు. ఎందుకనగా ఆ శిశువు జీవించిన ఆ ఒక్క నిమిషమే దేవునియొక్క కృప నిమిషమైయున్నది. కొందరు భూమి మీద ఒక నిమిషమైనను బ్రతుకరు. గర్భమందే మృతులై బయటికి వత్తురు. వారు గర్భములో జీవించినది జీవిత కాలము కాదా? అది కృప కాలము కాదనుటకు ఎవరికి నోరువచ్చును. అది కృపకాలముకాక మరేమైయుండును. సమస్తమును దేవుని స్వాధీనములో నున్నవి. మానవుడు తన నిర్లక్ష్యము వలన కృపా సమయమును పోగొట్టుకొనుచున్నాడు. కృపా కాలమున్నదిగాని మానవుడు గ్రహించుట లేదు. ఎందుకనగా అతడు అనుభవించుట లేదు. 136వ దావీదు కీర్తన చిత్రమైన రచనా కృతమైనది ఈ కీర్తనకు

"కృప నిరంతరముండును" అను పేరు పెట్టిన మంచిది. ఇదంతయు కృప కాలమును గురించి అయితే కృప అనగా నేమి? దీనికి క్లుప్తముగా జవాబు చెప్పవలెనన్న దేవునిలో ఏమి ఉన్నవో అవన్ని కలిపి కృపా భాగ్యములైయున్నవి. ఆ భాగ్యములన్నియు దేవుడు మనకిచ్చుటయే కృపయైయున్నది. కృప, కృపా భాగ్యము, కృపకాలము ఈ మూడును జ్ఞాపకముంచుకొనవలెను.

మన ప్రభువైన యేసుక్రీస్తును శాశ్వతమైన ప్రేమతో ప్రేమించు వారికందరికిని కృప కలుగును గాక! ఎఫెసీ. 6:24. ఆమేన్.

# బాలరాజు - యోషీయా

(అనగా యెహోవా బాగుచేయును)

**"తానింకను బాలుడై యుండగానే తన పితరుడైన దావీదుయొక్క దేవునియొద్ద విచారించుటకు పూనుకొనెను" (34:3).**

**వాక్యము: 2దినవృత్తాంతములు. 34,35 అధ్యాయములు**

యోషీయా యూదా రాజ్యమునకు చిన్నతనమందే రాజాయెను. ఈయన 8 సం॥ములప్పుడు రాజుగా ఏలుట ప్రారంభించెను. ఈ రాజు చరిత్రలో ఆయన చేసిన రెండుపనులు కనబడుచున్నవి. (1) దేశమును శుభ్రపరచు పనిచేసెను. (2) పండుగచేసెను. యెరూషలేములోను, ఆదేశ గ్రామములలోనున్న విగ్రహాలను పడగొట్టించెను. బైలు దేవతలను, ఆయాదేవతలను ఆరాధించువారిని తరిమివేసెను. తరువాత దేవాలయమును బాగుచేసెను. ఇదంత దేశమును శుభ్రము చేసేపని. "యూదా దేశమును, యెరూషలేమును పవిత్రముచేయ నారంభించెను", అని

వాక్యములో వ్రాయబడియున్నది, అట్లే పరిశుద్ధ పరచెను. ఈ శుభ్రపరచేపని పూర్తి అయినది గనుక తీరికగా నుండెను. తర్వాత యెహోవా నామమందు పండుగ చేయవలెనను మంచి ఉద్దేశ్యము కనపరచెను. యెహోవా పస్కాపండుగ:- ఈ పండుగ చేయవలెనని అందరికి తెలియజేసెను. పండుగ కబురు అందరికి తెలియగానే అందరు గుంపులు గుంపులుగా వచ్చిరి. ప్రజలు, యాజకులు, లేవీయులు, గాయకులు, యెహోవా మందిర సేవచేయు సేవకులందరు వచ్చిరి. అప్పుడు యెరూషలేము పట్టణము మహా మనోహరముగా కనబడుచున్నది. ఒకదరినుండి సేవచేయువారు, గాయకులు, రాజుగారు పండుగకు వచ్చుచుండిరి. ఒకదరినుండి ప్రజలు ఉత్సాహముతో పండుగలో పాల్గొనుటకు వచ్చుచుండిరి. వారు పస్కాపండుగను ఎప్పుడును ఎరుగరు. వారి పితరులు ఐగుప్తులో ఎప్పుడో ఈ పండుగ చేసిరి. సమూయేలు కాలమునుండి అంతగా ఈ పండుగ జరుగలేదు. ఒకవేళ పండుగ చేసినను అంత గంభీరముగా చేయుటలేదు. యోషీయారాజు కాలములో గంభీరముగా చేసిరి.

ఈ పండుగలో అందరు ఏకీభవించిరి. చిన్నరాజైనను భక్తిపరుడనియు, మంచివాడనియు అందరును గ్రహించిరి. దేశమును శుభ్రము చేసినాడను క్రియ అందరికి తెలిసినది, కనబడినది. గనుక ప్రజలందరు రాజు ఏమిచేయమంటే అదే చేయుటకు సిద్ధముగా నున్నారు. గనుక పండుగలో అందరు ఏకీభవించిరి. (1) ప్రజలు, (2) లేవీయులు, (3) యాజకులు, (4) మందిర సేవకులు, (5) గాయకులు, (6) ద్వారపాలకులు ఎవరిస్థలములో వారుండి సేవచేయవలెను. ఎవరు ఏ స్థలమందుండవలెనో వారక్కడనే యుండవలెను. గాని వారిస్థలము విడిచిపెట్టకూడదు అని రాజు ఆజ్ఞ ఇచ్చెను. ఈ రాజు క్రమము ఎరిగినవాడు, క్రమ ప్రకారము వారి వారి స్థలములు ఏర్పరచి పండుగ ఆచరించెను. మరియు రెండు

క్రమములు గలవు. (1) దావీదు క్రమము. అనగా దావీదురాజు వ్రాసి ఇచ్చిన క్రమము. (2) సొలోమోను క్రమము అనగా రాజైన సొలోమోను వ్రాసిఇచ్చిన క్రమము. వీటి ప్రకారము చేయవలెను. ఇది వారి పూర్వికుల క్రమము. వారి కాలములలో పరిపాలన బాగున్నది. తర్వాత రాజులలో భేదములు పుట్టికథ బాగుగా నడువలేదు. ఇన్నాళ్ళకు దైవభక్తిగల రాజు వచ్చినాడు. ఇతడు రాజులలో గొప్పరాజు. చిన్నవాడు. పస్కాపండుగ ఆచరించునప్పుడు మనము కనిపెట్టవలసినది క్రమము. ఇందులో మూడు క్రమములు కలవు. మొదటిది పై 6 గుంపులు ఎక్కడనుండవలెనో అక్కడనే ఉండవలెను. రెండవది దావీదు క్రమము, మూడవది సొలోమోను క్రమము. దీనిలో స్థలములు, పనులు ఏర్పరచినాడు. ఏ విధమైన అల్లరులు, పోట్లాటలు, మనస్పర్ధలు లేకుండ జరుగుటకు క్రమములు ఏర్పరచెను. ఈ రాజు దగ్గర మంత్రులుకూడ మహాగొప్ప పనిచేయగల సమర్థులున్నారు.

సామెతలు 1:7 "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము" ఈ బాలుడైన రాజునకు దైవభక్తియున్నది గనుక జ్ఞానమునకు మూలమైనది. ఆయన చేతిక్రింద ఆయాపనులు చేయించు అధిపతులున్నారు. అందరు అన్నిపనులలో ఏకీభవించిరి. ఇది రమ్యమైన సంగతి. గనుక ఎంతపనినైనను, ఎంత పండుగ అయినను చేయగలరు. రాజు ఇచ్చిన ఆజ్ఞ రెండు భాగములు యెహోవాకు సేవచేయుడి. ఆయన జనులకు సేవచేయుడి. ఈ పస్కా పండుగలో ముఖ్యమైన వస్తువు గొర్రెపిల్ల. పశువును వధింపకపోయిన పండుగకాదు. చాల కుటుంబములు గలవు గనుక రాజు ముప్పదివేల గొర్రెలను ఇంకను కొన్ని మేకలను, కోడెలను పస్కా పశువులుగా ఇచ్చెను. అర్పించు పనిచేయు లేవీయులు ఆ పని సాగించిరి. వారు గొర్రెపిల్లను వధించిరి. ఈ పనికి వారు తమ్మును తాము సిద్ధపరచుకొనిరి.

యాజకులు కూడ తమ్మును తాము సిద్ధపరచుకొని రక్తమును అర్పించిరి. వారు శుద్ధి చేసికొనుట, ప్రజలను శుద్ధిచేయుట జరిగెను. అదివరకు ఎన్నడును జరగని రీతిగా యోషీయా కాలములో పండుగ జరిగెను. అదే సమయమున మరియొక సంగతి జరిగెను. అదివరకు లేవీయులు మందసమును మోసిరి. అందు పదియాజ్ఞలు, మన్నా, చిగిరించిన అహరోను కర్ర ఉండెను. ఇశ్రాయేలీయులు 40సం॥లు అరణ్యములో దానిని మోసిరి. యోర్దాను దాటి పాలెస్తీనా వెళ్ళుటకు ముందు మందసమును మోసిరి. తరువాత విగ్రహారాధన వచ్చినది గనుక మందసమును వేరొకచోట పెట్టిరి. బాలరాజైన యోషీయా ఈ సాక్ష్యపు మందసపు పెట్టెను తెప్పించెను. ఇదివరకు ఐక్యత లేనప్పుడు మందసము అటు యిటు త్రిప్పవలసి వచ్చినది. బాలరాజు ఇచ్చిన ఆజ్ఞ ఏమనగా మందసము దాని స్థలమందే యుండవలెను. (1) మందసపు పెట్టె తేవడము (2) పశువును వధించుట (3) రక్తము ప్రోక్షించుట – మూడు పనులు యోషియా కాలములో జరిగెను. ఇదంతయు వాక్యములో ఏమి ఉన్నదో అదే చెప్పబడెను.

**ఇందులోని పరిశీలనాంశములు:–** పాతనిబంధన ప్రజలు ఏమిచేసినారో అది అంత క్రొత్త నిబంధనకు ముంగుర్తు. ఇది యూదులయొక్క మత సంఘచరిత్ర పాతనిబంధనలో జరిగినవన్ని క్రొత్తనిబంధనలో జరుగవలెను. వారేమి చేసినను ఇకముందుకు ఇది జరుగవలెనని నిరీక్షించువారు. (1) పాతనిబంధన గొఱ్ఱెపిల్ల మన ప్రభువైన క్రీస్తునకు ముంగుర్తు. ఇశ్రాయేలీయులయొక్క దాసత్వ విమోచన సమయమున గొఱ్ఱెపిల్ల వధింపబడెను. (2) రక్తప్రోక్షణ ఏ పనిమీద చేసిరి. శుద్ధికొరకు, రక్తము ప్రోక్షింపబడగానే వారందరు పరిశుద్ధులుగా నెంచబడిరి. ఈ ప్రోక్షణ యేసుప్రభువుయొక్క

రక్తమునకు ముంగుర్తు. యేసురక్తము సర్వజన పాపపరిహారము కొరకు చిందింపబడెను. వీటికి సంబంధించిన పోలికలు చాలాగలవు. ఆయన రక్తమునందు విశ్వసించినవారు పరిశుద్ధులు కాగలరు. (3) లేవీయులు, వీరికి బోధకులని పేరు, క్రొత్త నిబంధనలో సంఘ పరిపాలకులైన పాదుర్లకు ముంగుర్తు. (4) గాయకులు పాటలు పాడుటకుగాను స్త్రీ పురుషులను ఏర్పాటు చేసిరి. క్రొత్త నిబంధనవారు క్వయరుపార్టీని ఏర్పాటుచేసిరి. (5) అంతాక్రమముగానున్నట్లు చూచుచున్నాము. అదే వ్రాయబడియున్నది. దావీదు, సొలోమోను వ్రాతలలోనున్న క్రమప్రకారము వారుచేసిరి. బైబిలులోని క్రొత్తనిబంధనలోనున్న క్రమము. సంఘములోను ఉండి తీరవలెను. ఆది సంఘములోనున్న క్రమము, ఈ క్రమములు సామాన్యమైనవికావు. వీరు పండుగచేసి ఎక్కువ సంతోషించిరి. ముంగుర్తుగా నున్నప్పుడే వీరు పండుగచేసిరి. వీరికెక్కువ సంతోషమా? మనకెక్కువ సంతోషమా? క్రొత్త నిబంధనవారమైన మనకెక్కువ సంతోషము. ఎందుకనగా మనము నెరవేర్పు గలిగిన పండుగలు చేయుచున్నాము. పౌలు ఆత్మసంబంధమైన పాటలతో స్తుతించవలెనని కోరుచున్నాడు. (6) ఎవరి స్థలములోవారు ఉండుట క్రొత్త నిబంధనలో ఏర్పబడినది. ఈ కాలములోనే సంఘములు, ఆరాధనలు, బోధకులు ఏర్పరుపబడెను. శిష్యులు మేము ఎల్లప్పుడు బల్ల దగ్గరనుంటే ప్రభువుపని ఎప్పుడు చేయగలము అని ఏడుగురుని ఏర్పరచిరి. అప్పుడు మేము సేవలో నుందుమని తీర్మానించిరి. గనుక ఎవరి పని వారే చేయవలెను.

ఇప్పుడు మన సంఘములలోకూడ అలాగే నున్నది. క్యాటకిస్టులు, ఇవాంజిలిస్టులు తమతమ పనులు చేయుదురు. ఈ

కాలములో సంఘములలో ఇంకా ఎక్కువ పనులుగలవు. యోషీయా కాలములో చేసినది పస్కాపండుగ. క్రైస్తవులైనవారు ఎందుకు పండుగ చేయవలెను? పాతనిబంధనలోనివారు సూచన పండుగ గంభీరముగా చేసిరి. ముంగుర్తుగా జరిగిన పండుగ (నెరవేర్పు అప్పటికి ఇంకా రాలేదు) బహు ఘనముగా చేసిరి. నెరవేరినప్పుడు ఇంకా ఎక్కువ సంతోషము గనుక క్రొత్త నిబంధన వారమైన మనము నెరవేర్పు గలిగియున్నాము గనుక వారికన్న ఎక్కువ చేయవలెను. ఉదా: పచ్చిమామిడికాయ చాలమంచిది. అన్నిటికి పనికివచ్చును గాని దీనికంటె పండు గొప్పది. అట్లే పాతనిబంధన గొప్పదేగాని అంతకంటెగొప్పది, సంతోషకరమైనది క్రొత్త నిబంధన గనుక పండుగ చేయుట స్వభావ సిద్ధముగా చేయవలెను. ముంగుర్తు కాలములెన్ని? సూచన కాలములెన్ని? పాత నిబంధన క్రొత్త నిబంధనకు ముంగుర్తు. మనము పరలోకమునకు ముంగుర్తు అని విశ్వాసము వలన గ్రహించుకొందుము. అక్కడ మహిమ ఉన్నదనియు, దేవదూతలు, సింహాసనము, ధవళవస్త్రము, కిరీటము, అనంతారాధన ఇవన్ని ఉన్నవని విశ్వాసముద్వారా గ్రహించుకొనుచున్నాము. ఇప్పుడు, ఇక్కడ

అవన్ని ముంగుర్తుగా చూచుచున్నాము. కాబట్టి మనము ఇక్కడ పరలోకములో మనకు సంభవించు వాటిని, పరలోకములో జరుగబోవు వాటినిచూచి సంతోషించుచున్నాము. పాతనిబంధనవారు మన క్రొత్త నిబంధనలో జరుగబోవు వాటినిచూచి సంతోషముతో చేసిరి. వారు రాబోవు దానికి నిరీక్షించి పండుగచేసిరి. మనమును పరలోకములో జరుగబోవు వాటినిచూచి సంతోషించుచున్నాము. పాతనిబంధనవారు ధన్యులు, మనము ఇంకా ధన్యులము, రేపు పెండ్లికుమార్తె వరుసలో నూతన యెరూషలేములో విందులో నుండువారు మరీ ధన్యులు. ఆ విందులో పాల్గొనే సిద్ధబాటు అంతస్థు ప్రభువు చదువరులెల్లరకూ అనుగ్రహించునుగాక! ఆమేన్.

# నడత మార్చిన నయమాను

*“అతడుపోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడుమారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను.” II రాజులు 5:14.*

దమస్కు ప్రధాన పట్టణముగా నున్న ఆరాము దేశములోని రాజుగారి సైన్యాధిపతి నయమాను. అతనివల్ల దేశమునకు జయము కలిగినందున అతడు రాజుగారికి ఇష్టుడాయెను. ఆ సేనాధిపతి ఎంత మంచివాడైనను, పరాక్రమశాలియైయున్నను, కుష్టరోగియై యుండెను. మా దేశములోనున్న దైవజనుడు కుష్టను బాగుచేయగలని ఆ సైన్యాధికారి భార్యదగ్గర నున్న ఒక బాలిక ఆమెతో చెప్పగా, అతడు ఇశ్రాయేలు దేశములోని షోమ్రోను పట్టణమందున్న ఎలీషా అను పేరుగల దైవజనుని గృహమునకు వెళ్ళెను. ఇశ్రాయేలీయులు దేవుని ప్రజలు అను బిరుదు పొందినవారు. వారి దేశము ఇశ్రాయేలు

దేశము. ఇది పాలెస్తీనాలో నున్నది. ఆ సైన్యాధికారి ఎలీషాగారికి కబురు పంపగా ఆయన నీవు యొర్దాను నదికి వెళ్ళి ఏడుమార్లు స్నానము చేసినయెడల నీ వ్యాధి అంతరించిపోవునని తన సేవకుని చేత చెప్పించెను. అది విని ఆ పటాలపు నాయకుడు ఆ దైవజనుడు నాయొద్దకువచ్చి నిలిచి, తన దేవుడైన యెహోవా నామమును బట్టి తనచెయ్యి రోగముగానున్న స్థలముమీద ఆడించి కుష్టురోగమును మాన్పునని నేననుకొంటిని దమస్కు నదులైన ఆబానాయును, ఫర్పరును ఇశ్రాయేలు దేశములోని నదులన్నింటికంటె శ్రేష్టమైనవి కావా! వాటిలో స్నానముచేసి శుద్ధినొందలేనా! అని అనుకొని రౌద్రుడై తిరుగు ప్రయాణము పట్టెను. అయితే అతని దాసులలో ఒకడు వచ్చి నాయనా ఆ ప్రవక్త ఏదైన నొక గొప్పకార్యము చేయుమని నియమించిన యెడల చేయకుందువా? అయితే స్నానము చేసి శుద్ధుడవు కమ్మనుమాట దానికంటె మేలుకాదా? అని చెప్పినప్పుడు అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యొర్దాను నదిలో ఏడు మారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను.

చదువరులారా! ఎలీషా బోధకుని గురించిన సువార్త చెప్పిన బాలిక మెచ్చుకొనదగినదా? ఆ సువార్త తన భర్తకందిచిన భార్య మెచ్చుకొనదగినదా? ఆ రోగ బాధితునికి సెలవిచ్చిన రాజుగారు మెచ్చుకొనదగినవాడా?తిరుగు ముఖము పట్టిన ఆ ఆరాము దేశీయుని గిద్రున నదియొద్దునకు నడిపించిన సేవకుడు మెచ్చుకొన దగినవాడా? దైవజనుడు చెప్పినట్లు చేసిన ఆ పరాక్రమశాలి మెచ్చుకొనదగినవాడా? దైవచిత్తము తెలిసికొని రోగి స్వస్థత నొందునను దృఢ విశ్వాసము

గల దైవమానవుడు మెచ్చుకొనదగినవాడా? చదువరులారా మీరు ఎవరి జట్టులో చేరుదురు? మంచి నీళ్ళ వలన కుష్టు కుదురునా? కుదరదు గాని ఈ కథలో కుదిరినది. అట్లయిన అట్టి వ్యాది గ్రస్తులందరు నీళ్ళలో స్నానము చేసినయెడల ఈ కాలమందు కూడ కుదురునా? మహాత్మ్యము ఎందులో నున్నది? నీళ్ళలోనా? ఆ జయశాలి విధేయతలోనా? నమ్మికలోనా? దైవపురుషుని వాక్కులోనా? ఆయన పలికిన వాక్కు. దైవ వాక్కు. దైవవాక్కువల్ల కార్యసిద్ధి దేవుడు తన వాక్కును పంపి ప్రజలను బాగుచేసెను. అని కీర్తన 107:20లో గలదు. వాక్కు ఎంత గొప్పదైనను రోగికి విధేయత లేనియెడల ఏమి ప్రయోజనము? చదువరులారా ఇశ్రాయేలీయుల బాలికవలె మీరును తెలిసియున్న ఉపకార సమాచారము ఇతరులకు అందించుచున్నారా? బాలిక, వ్యాధిగ్రస్తుని భార్య, వ్యాధిగ్రస్తుడు, ఆరాము దేశముయొక్క రాజు, దైవజనుడు, ఆయనయొద్దనుండి కబురు తెచ్చిన సేవకుడు, నదియొద్దకు వెళ్ళవలసినదని సలహా ఇచ్చిన సేవకుడు, ఈ ఏడుగురును ఈ చరిత్రలో చేసిన పనులు ధ్యానించండి. దైవప్రార్థన చేయుచు ధ్యానించిన యెడల మీ ఆత్మకు ఆనందము కలుగును.

నయమాను చేత దేవుడు ఆరాము దేశమునకు జయము కలుగజేసెను. అతనిని గురించి ఇది ఒక మంచి విషయము. అతడు ఘనుడు. ఇది రెండవ మంచి విషయము. అతడు రాజుగారి దయను పొందినవాడు, ఇది మూడవ మంచి విషయము. అతడు మహా పరాక్రమ శాలి. ఇది నాల్గవ మంచి విషయము. ఈ నాలుగు మంచి విషయములనుబట్టి అతనిలో సంతోషము లేకపోలేదు. అయిన అతని వ్యాధిని గురించి చింతకూడ లేకపోలేదు. ఒకరికి శరీర జీవితములో ఎన్ని సంపదలు ఉన్నప్పటికిని ఏదోయొక కొదువయును, హానికరమైన

విషయమును, ఉన్నయెడల మనశ్శాంతి ఉండదుగదా! అట్లే ఒకరి ఆత్మీయ జీవితములో ఎన్ని మంచి గుణములున్నను ఏదోయొక దుర్గుణమున్న యెడల అది తొలగించుకొను వరకు నెమ్మది కలుగదు గదా! గనుక నాలో ఎన్నో మంచి గుణములున్నవి గాని ఒకటేగదా దుర్గుణము అని ఎవరును అతిశయింపరాదు. అది పరిహారము చేసికొనవలెను. మరియొక సంగతి ఆ దయాప్రాప్తుడు ఆ మతగురుని సలహాను అపార్ధము చేసికొనెను. రౌద్రము తెచ్చుకొనెను. ఈ రెండును మంచివికావు. ఇతనివలె దైవవాక్కును గ్రహింపనివారు గలరు. అట్టి వారు అతనివలెనె తమ తలంపును వెంటనే మార్చుకొన్న యెడల ఉపకారము పొందుదురు. మరియొక సంగతి. ఆ స్వస్థచిత్తుడు ఎంత గొప్పవాడైనను తన సేవకుని మాట విన్నందువలన బాగుపడెను. నేనధికారిని, ఇతడు నా సేవకుడు, ఇతని మాట నేనెందుకు గైకొనవలెను అని అతడు అనుకొనలేదు. ఆలాగే ఎంత గొప్పవారైనను ఎంత తెలిసిన వారైనను తమకన్న తక్కువైన వారు ఇచ్చిన సలహా

వినుట క్షేమము. ఇదివరలో చెప్పినట్లు దైవవాక్కువల్ల మనము బాగు కాగలము. అది బైబిలు గ్రంథమందున్నది. బైబిలులోని బోధ విన్న తర్వాత ఎట్టి బాధితులకైనను శాంతి కలుగకమానదు. ఒకప్పుడు యేసుక్రీస్తు ప్రభువు ఒకరిని చూచి నీవు వెళ్ళుము, నీ కుమారుడు బ్రతికి యున్నాడు అని చెప్పెను. అతడు వెళ్ళిచూడగా అతని కుమారుడు జ్వరముపోయి సుఖముగా నున్నాడు. యోహాను 4:50 ప్రభువు వాక్యము నమ్మబట్టిగదా అంత గొప్పపని జరిగినది. వాక్యమును బట్టియేగదా స్వస్థత కలిగినది. గనుక బైబిలులోని దైవ వాక్యమును నిర్లక్ష్య పెట్టరాదు, ఆలకింపవలెను, నమ్మవలెను. నయమాను కథ నమ్మువారి వ్యాధులు నయమౌనుగాక! ఆమేన్.

# దైవ గ్రంథము

*"ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి". II పేతురు 1:21.*

క్రైస్తవుల మతగ్రంథము బైబిలు. బైబిలను పదము పుస్తకమను అర్థమిచ్చు "బిబ్లొస్" అనుగ్రీకు పదమునుండి వచ్చినది. ఇదియొక్కటేనా పుస్తకమని పిలువబడుటకు తగినది? ప్రపంచమందు దీనిని మించిన పుస్తకములు లేవా? బైబిలను మాటను బట్టి ఇది యొక్కటే పుస్తకమనిపించుకొనుటకు తగినదా? ఎందుచేత?

1. దేవుని ఆత్మచేత నడిపింపబడిన భక్తిపరులచే వ్రాయబడుట చేతను: ఆదియందు దేవుడు సృష్టినెట్లు కలుగ జేసినదియు, ప్రపంచముల పరిశుద్ధత, పాపప్రవేశము, మానవులను రక్షించుటకు దేవుడు చేసిన వాగ్దానము, ఆ వాగ్దాన నెరవేర్పును

దేవుడెట్లు చూపించినదియు, పాపమేదో, పరిశుద్ధతయేదో, ఆయన తెల్పుటయు, పాప పరిహారమును దేవుడిచ్చువాటిని పొందుటయునెట్లో బైబిలు మనకు చెప్పుటచేతను, మానవులనందరిని రక్షించుటకు దేవుడు ఏర్పాటు చేసిన ఏకమార్గమిందు కనబడుట చేతను, మనుష్యులు క్రమ క్రమముగా కుటుంబములుగాను, జనాంగములుగాను అనేక భాషలు మాట్లాడువారుగాను, వివిధ వృత్తులు గలవారుగాను, వృద్ధియైన సంగతి బైబిలులో వ్రాయబడుట చేతను, అవిధేయులను శిక్షించుచు, విధేయులను రక్షించుచు, మానవజాతిని దేవుడెట్లు నడిపించినాడో అదియు బైబిలునందుండుట చేతను, దేవునిచేత సృష్టింపబడిన ఇద్దరు మానవులనుండి లోకమంతయు ఎట్లు వృద్ధియాయెనో బైబిలు చూపుట చేతను, ఆది మానవులు దేవుని మాత్రమే పూజించుటయు పిమ్మట వచ్చినవారు అనేక మతములుగా ఎట్లు విభాగములు చేయబడిరో బైబిలు తెలుపుటచేతను మానవ జ్ఞానమునకు దేవుడు తన చిత్తమును, ఉనికిని క్రమముగా ఎట్లు బయలుపరచెనో బైబిలు మనకు సరిపడిన సంగతి కలిగియుండుటచేతను, మానవులు సుఖముగా జీవించుటకు గాను గతకాల చరిత్రయు, భావికాల చరిత్రయు బైబిలునందుండుట చేతను, మానవులకు ఆత్మీయ విషయములను బయల్పరుచుటకు దేవుడు తన భక్తులనెట్లు పంపించెనో బైబిలునందు వ్రాయబడుట చేతను, దేవుడు తన దైవత్వమును లోకైక రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువుగా భూమిమీద మానవ స్వరూపమందు బయలు పరచుకొనెనని బైబిలు బోధించుట చేతను, క్రీస్తుప్రభువు మానవులను నశింపచేయుచున్న పాపము నెట్లు జయించి మానవులందరికొరకు సమస్తోపకార కార్యములను ఎట్లుచేసెనో బైబిలు వివరించుట చేతను, క్రీస్తు మతము

స్థాపింపబడి ఆకాల ప్రపంచమంతయు ఎట్లు వ్యాపించెనో బైబిలు చూపుటచేతను, రక్షణకొరకు ఎదురుచూచువారు క్రీస్తును అంగీకరించినయెడల ఎంతపాపియైనను రక్షింపబడునను కృపాదరణ బైబిలిచ్చుటచేతను, బైబిలు చదువు ప్రతివారును దేవుడొక్కడే అనియు క్రీస్తుప్రభువుద్వారా తన దైవత్వమును బయలు పరచుకొన్న ఆయనే లోకైక రక్షకుడనియు, సర్వ జనాంగములను ఆహ్వానించునది క్రైస్తవమత మొక్కటేయనియు, మానవులకు కావలసినన్ని దేవుని మాటలుగల పరిపూర్ణ గ్రంథమనియు గ్రహింప గల్గునట్లు చేయుటచేతను బైబిలు పుస్తకమనియు, గొప్ప గ్రంథమనియు దైవగ్రంథమనియు చెప్పవచ్చును.

**ఇవి బైబిలునుండి తీయబడిన ఋజువులు:-**

2. ఇది మొట్టమొదట కనిపెట్టబడిన ముద్రాక్షరశాలలో మొట్టమొదట అచ్చువేయబడిన గ్రంథమగుటచేతను, అక్షరములను లెక్కింపబడిన గ్రంథమియొకటే యగుటచేతను లెక్కింప శక్యముగాని వ్యాఖ్యాన పుస్తకములు బైబిలునకే వ్రాయబడుటచేతను, ఆ పుస్తకములు చదువుటకు మానవుని జీవితముకూడా చాలనందుచేతను ("యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు గలవు వాటిలో ప్రతి దానిని వివరించి వ్రాసిన పక్షమున అట్లువ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదని నాకు తోచుచున్నది", అని ఆయన శిష్యులు చెప్పెను. యోహాను 21:25. ఒక్కొక్క పదము ఎన్నిసార్లు గలదో లెక్కింపబడిన గ్రంథమగుటచేతను, ఒక్కొక్క పదము ఏయే అధ్యాయములలోను వచనములలోను, గలదో వ్రాయబడిన గ్రంథమగుట చేతను, సర్వదేశాలవారును ఇందలి వాక్యములను

పుస్తకములందు ఉపయోగించుకొనుటచేతను, రెండువేలకు పైగా భాషలలో తర్జుమా చేయబడిన గ్రంథమిది యొకటే యగుటచేతను, ఆయా గ్రంథములను చదివిన పిమ్మట పొందిన ఆదరణకంటే బైబిలును చదివిన పిమ్మట ఆత్మాదరణ పొందితిమని దీని చదువరులనేకులచే యోగ్యతాపత్రములు పొందిన గ్రంథమగుట చేతను ఇతర పుస్తకములలో అనేక మంచి సంగతులు గలవుగాని క్రీస్తులేదని గుర్తించిన సాధు సుందర సింగును, సుప్రసిద్ధ శాస్త్రవేత్తను మార్చగలిగిన గ్రంథమగుటచేతను, 2600సం॥ల క్రిందట ప్రపంచము నేకచక్రాధిపత్యమునసేలు అన్యరాజులు తమచరిత్రలు వ్రాయించిన రాళ్ళు భూగర్భమునుండి ప్రస్తుత కాలమున త్రవ్వగా బయల్పడి బైబిలు చరిత్ర జరిగినదేయని బైబిలు ఋజువు చేయించు కొనుటచేతను (వీరు ఊరకుండిన యెడల ఈ రాళ్ళు కేకలు వేయును లూకా 19:40) బైబిలు గొప్ప గ్రంథమనియు, ఎన్నటికిని నాశనము చేయబడని దైవగ్రంథమనియు చెప్పవచ్చును.

Bible Mission HQ Guntur

**ఇవి సంఘ చరిత్రనుండి తీయబడిన ఋజువులు:-**

మరియు బైబిలు పరిశుద్ధమైన పుస్తకమును, కథల పుస్తకమును, చరిత్ర పుస్తకమును, దైవోపదేశము గల పుస్తకమును, అన్ని ప్రార్ధనలకు జవాబిచ్చు పుస్తకమును, సమస్త జనులకు ఉపయోగకరమైన పుస్తకమైయున్నది. బైబిలునందుగల అరువదియారు పుస్తకములలోను ఒకవ్యక్తినిగూర్చి కొంతవరకు కనుగొనగలము. ఆయన యేసుక్రీస్తు ప్రభువే దీనినంగీకరించి నిత్యము చదివి ధ్యానించువారు ధన్యులు అని వ్రాయించిరి. (కీర్తన. 1,2). చదువరుల నందరిని దేవుడు దీవించునుగాక! ఆమేన్.

# పాత్రలలో నూనె ఊరుట

**“పాత్రలన్నియు నిండిన తరువాత ఇంక పాత్రలు తెమ్మని ఆమె తన కుమారునితో చెప్పగా వాడు- మరేమియు లేవని చెప్పెను. అంతలో నూనె నిలిచిపోయెను.” వాక్యము: ॥ రాజులు 4:6.**

ఈ వాక్యభాగములో ఇశ్రాయేలీయులలో జరిగిన కథ వ్రాయబడినది. ఒక స్త్రీయొక్క భర్త చనిపోయెను. ఆమెకు బిడ్డలు గలరు. అప్పులు చాలగలవు. అప్పులవారు వచ్చి ఆమెను బాధించుట వలన ఆమె ప్రవక్తయైన ఎలీషాతో చెప్పెను. ప్రవక్త నీ దగ్గర ఏమి ఉన్నది అని అడుగగా, ఆమె ఒక నూనెపాత్ర మాత్రము కలదని చెప్పెను. అప్పుడు ప్రవక్త నీవుపోయి నీ ఇరుగు పొరుగు వారియొద్ద ఉన్న పాత్రలు తెచ్చి అన్ని పాత్రలలో కొంచెము, కొంచెము నూనె పోయుమని చెప్పెను. ఆ తల్లి, కుమారులు అట్లు చేయగా పాత్రలన్నియు నూనెతో నిండెను, ఇంకా పాత్రలు లేవని తల్లితో

చెప్పిరి. తర్వాత ఆమె ప్రవక్త దగ్గరకు వెళ్ళి పాత్రలన్ని నిండిన తర్వాత నూనె ఆగిపోయెనని చెప్పగా ప్రవక్త ఆ నూనె అమ్మి అప్పులు తీర్చుమని చెప్పెను.

1. ఆ కాలము ప్రజలైన వారికి ప్రవక్త దగ్గరకు వెళ్ళివారి అక్కరలు చెప్పువాడుక కలదు. గనుక స్త్రీ తన కష్టము ప్రవక్తతో చెప్పెను. కుండలన్ని నిండువరకు నూనె ప్రవహించుచుండెను. కుండలు లేనందున ధార ఆగిపోయెను. అద్భుత క్రియ దేవుడు జరిగించెను. అవసరమున్న యెడల దేవుడు అద్భుతము చేయును గాని తమాషాకు చేయడు, ఉపయోగముకూడ నుండవలెను. యేసుప్రభువుకూడ అవసరము నిమిత్తమే చేసెను. మనుష్యుల అవసరము తీర్చుటకు ప్రవక్తలు, యేసుప్రభువు అద్భుతములు చేసెను. ప్రవక్తలు ప్రార్థించి అద్భుతములు చేసిరిగాని, యేసుప్రభువు దేవుడు గనుక తనంతట తానే అద్భుతములు చేసెను. ఇశ్రాయేలీయులు యోర్దాను దాటునప్పుడు అద్భుతము అవసరము గనుక ఈ ప్రక్క ఆ ప్రక్క నీరు నిలిచిపోయెను. (యెహోషువ 3వ అధ్యాయము) ఈ కాలమందు దేవుడు చేయునుగాని, మనకు కావలసినవన్ని ఉన్నవి ఏదైన కావలసి వచ్చినపుడు చేయును గాని తమాషాకు చేయడు. ప్రతివారును తమ అవసరములను దేవునియొద్ద తెలియజేయవలెను. దేవుడు సాధనముల ద్వారా అవసరము తీర్చును లేదా అద్భుతము చేయును. 2. ఈమె భర్త విశ్వాసి. ఆమె దగ్గర చిన్న కుండలో నూనె గలదు. మనకు ఏది ఉన్నదో, అది ముందు వాడవలెను. యేసుప్రభువు ఐదువేల మందికి ఆహారము పెట్టునపుడు ఐదు రొట్టెలు తీసికొనెను. గనుక ముందు ఉన్నవి వాడుకొనవలెను. తర్వాత అద్భుతక్రియ

జరుగుటకు ఏర్పాటు ఉండును. మన దగ్గర సొమ్ము ఉండి అది ఖర్చు చేయకుండ ఏ అక్కర గురించియైన ప్రార్థించిన యెడల అది నెరవేరదు. ఆ సొమ్ము అయిన తర్వాత అక్కర విషయము ప్రార్థించిన నెరవేరును. యేసుప్రభువు కనాను పెండ్లివిందునందు నా సమయము ఇంకా రాలేదని చెప్పెను. ఉన్నవి జాగ్రత్తగా వాడుకొనిన తర్వాత యేసుప్రభువును అడుగవలెను. ఆయన మన మనవి ఆలకించును.

3. వారు ఇరుగు పొరుగు వారియొద్దకు వెళ్ళి వట్టికుండలు తీసికొనివచ్చి వాటిలో కొంచెము నూనెపోయగా ఆ కుండలు నూనెతో నిండెను. ఇంక ఎక్కువ కుండలు తెచ్చిన ఇంకను నూనె వచ్చును. కుండలు లేనందున తైలము ఆగిపోయెను. మనము ఎంత తీసుకొనగలమో అంతే ప్రభువు ఇచ్చును. ఎక్కువ ఇయ్యడు కృపావరములు, బహుమానములు దేవుని దగ్గర చాల ఉన్నవి గాని మనము ఎంత తీసికొనగలమో అంతే మనకు వచ్చును. కథలోని స్త్రీకి ఆ నూనె చాలును గనుక నూనె ఊరుట ఆగిపోయెను. తండ్రి ఉచితముగా ఇచ్చును. ఎంతైన ఇవ్వగలడు. దేవుడు ఇవ్వలేదు అనకూడదు. మనము పుచ్చుకొనుటలోనే లోపమున్నది. 4. స్త్రీయొక్క కుండలోని నూనె వారికి రొట్టె కాల్చుకొనుటకు సరిపోవునుగాని అప్పుల వారికిచ్చుటకు చాలదు. మనకు సరిపడు విశ్వాసముండును గాని ఇతరులకిచ్చుటకు చాలదు. గనుక సరిపడు విశ్వాసము సరిపోవునది మాత్రమేకాక ఇతరులకుకూడ ఉపయోగపడునంత సంపాదించుకొనవలెను. విశ్వాసులకుకూడ కొన్ని కొదువలు వచ్చుచున్నవి. మనము వారి యొద్దకు వెళ్ళి రహస్యముగా మాట్లాడిన కనబడును. ఒక వ్యక్తి సంతోషముగాలేదు అనగా అతనికి ఏమి

కొదువగా ఉన్నదో ఎందుకనగా అతని హృదయ పాత్రలో సంతోషములేదు. ఆ స్త్రీ వట్టి కుండలను నూనెతో నింపినట్లు ఆ సంతోషము కొదువగానున్న విశ్వాసి ప్రభువు నొద్దకు వెళ్ళిన ఆ ఖాళీహృదయమును సంతోషముతో నింపును. ఇది అన్నిటికన్న విలువైన సంగతి.

విశ్వాసి మోకాళ్ళమీదనుండి ప్రార్థించినపుడు ప్రార్థన కుదిరిన వెంటనే సంతోషము హృదయములో ప్రవేశించును. మరొక విశ్వాసివద్ద మరొక కొదువ కనిపించును. విశ్వాసము మందగిలినప్పుడు సంపూర్ణ విశ్వాసము కావలెను. అప్పుడు ప్రార్థించిన బలమైన విశ్వాసము కలుగును. మరొక విశ్వాసికి ఏమి చేసిన చిక్కుపోవునో తెలియదు, జ్ఞానము లేదు. అటువంటి సమయములో ప్రార్థనలోనికి వెళ్ళి చేయగా, చేయగా జ్ఞానము కలుగును. ఏమి చేసిన ప్రార్థన, విన్నపములు నెరవేరునో అట్టి జ్ఞానము కలుగును. వారు ఎంత వరకు అందుకొనగలరో అంత సంతోషము, అంత విశ్వాసము, అంత జ్ఞానమును వచ్చును. అలాగే ఖాళీ హృదయముతో ప్రభువు దగ్గరకు వస్తే వాటిని అయన తన అత్మతో (లేక) శక్తితో నింపును. మనము సరిచేసుకోలేని లోటుపాట్లను, విడిచిపెట్టలేని పాపమును, మన నైజమును, మొ॥వి ప్రభువునకు తెలియజేస్తేనే అయన వాటిని సరిచేయును.

5. దేవుని కృపాధార ఎప్పుడును ప్రవహించుచునేయుండును

యోబు 29:6 లో "బండ నుండి నా నిమిత్తము నూనె ప్రవాహముగా పారెను" అని గలదు. బండలోనుండి వచ్చిన నీరు ఇశ్రాయేలీయులు

కావలసినంత త్రాగిరి. కొండలో నుండి తైలమును ప్రభువు రప్పించగలడు, అయనకు అసాధ్యమైనది ఏమియు లేదు. కుండలో నుండి తైలము రాలేదా, అలాగే కొండలో నుండి కూడా రాగలదు. ఎక్కడ ఏదిలేదో అక్కడ దేవుడు అది చేయగలడు. పచ్చికలో ఐదువేలమంది భోజనమునకు కూర్చున్నారు, వారికి భోజనము ఎక్కడనుండి వచ్చును. ఏమియు పుట్టనటువంటి చోట ఆయన ఏదైనా పుట్టించగలడు. విశ్వాసుల అక్కర ఆయనయొద్దకు తీసికొని వెళ్ళినప్పుడు వారి అక్కర తీర్చుటకు ఆయన ఏదైన పుట్టించగలడు. ఎవరు ఏది అందుకొనగలరో అది ప్రభువు అందించగలరు.

ఖాళీ కుండలు – ఖాళీ హృదయములు
నూనె శరీర జీవనము కొరకు – ఆత్మ
జీవనము కొరకు
దేవుడు కావలసినవి ఇచ్చును.
ఖాళీ కుండలు నింపిన దేవుడు – ఖాళీ
హృదయములను విశ్వాస, జ్ఞాన సంతోషములతో నింపును.

6. మన జీవితములో ప్రభువును అడుగుటకు గొప్ప ఆధారముగా నున్నది. ఈ వాక్యము లూకా 11:11,12, 13వచనములలో ఆయననుఅడుగువారికి పరిశుద్ధాత్మను కొలత లేకుండా ఇచ్చును అని వ్రాయబడి ఉన్నది. నూనెను కొలుచుదురు. అట్టి కొలత లేకుండా ఆత్మను అనుగ్రహింతునని ప్రభువు చెప్పెను. కొలత కొంచెము, మ్రొక్కుబడికి ఇచ్చినట్లుండును. అట్లుగాక కొలత లేకుండ ఆత్మను ఇచ్చును. ఆత్మను పొందినవారు తగ్గిపోవచ్చును.

వారు నింపబడవలెను. ఒకప్పుడు ఉద్రేకము తగ్గవచ్చును మరల నింపుకొనవలెను. ఈ భూలోకపు తైలముకంటే ఆ తైలము అనగా పరిశుద్ధ ఆత్మ అభిషేకతైలము గొప్పది. ఆత్మపొంది ఊరకుండుట కాదుగాని పూర్తిగా నింపబడవలెను. ఆయనకు మన హృదయములో స్థలమునిచ్చిన ఆయన ఉచితముగా తన ఆత్మనిచ్చును. గనుక వారి హృదయములలో నుండి జీవపు ఊటలు ప్రవహించును (యోహాను 7:38; యెషయా 58:11). కుండలో కొంచెము నూనెపోయగా ఆ నూనె ఊటలు కుండను నింపినట్లు విశ్వాసి హృదయములో జీవపు ఊటలుపుట్టి ప్రవహించును. ఆ జీవపు ఊటలు ఇతరులకు ఉపయోగకరముగా నుండును. విన్నవారు ఎవరైతే ఉన్నారో వారు ఆత్మచేత పొందియున్నారు గనుక మీరు చెప్పిన వాక్యము విన్నవారు ఆత్మను పొందిరి. ఒక కుండలోని నూనె అన్ని కుండలలోనికి వెళ్ళినట్లు, విశ్వాసియొక్క నిండు హృదయములలలో నుండి ఇతరుల హృదయములోనికి జీవపు ఊట ప్రవహించి నింపును.

7. కథలో ప్రవక్త ఆమెతో “నీవు నీ ఇంటిలోకి వచ్చి నీవును నీ కుమారులును లోపలనుండి తలుపుమూసి, ఆ పాత్రలన్నిటిలో నూనె పోయుము” అనిచెప్పెను. దేవుడు అద్భుతము చేయనైయున్నాడు

గనుక ఇతరులెవ్వరు ఉండకూడదు. ఆయన అద్భుతము చేయునపుడు విశ్వాసులును, ఆ కార్యమునకు సంబంధించినవారు మాత్రమే ఉండవలెను. యేసుప్రభువు యాయీరు కుమార్తెను బ్రతికించినపుడు కూడ ఎవ్వరిని రానీయలేదు. (మార్కు 5:37). కథలో తైలము ఊరునప్పుడు కూడ ఎవ్వరు నుండకూడదు. ప్రార్థించు ఆమె ఉండవలెను. సేవచేయు కుమారులును ఉండవలెను. మరెవ్వరు నుండకూడదు. పెండ్లికుమార్తెకూడ అట్లే రహస్యమందు అద్భుతము చేయును. దేవుడు తాను ఏర్పరచుకొనిన విశ్వాసులతో ప్రత్యేక అద్భుతములు రహస్యముగా చేయించును. అట్టి అంతస్తుకు సిద్ధపడగల ధన్యత ప్రభువు అనుగ్రహించునుగాక! ఆమేన్.

# విశ్వాస స్థిరత

వాక్యము: దా॥కీర్తనలు. 56:12; యోహాను 16:33; 1పేతురు. 5:9.

**"లోకమందున్న మీ సహోదరులయందు ఈ విధమైన శ్రమలే నెరవేరుచున్నవని యెరిగి, విశ్వాసమందు స్థిరులై వానిని ఎదిరించుడి." పేతురు 5:9.**

ఓ దేవా! నీ దివ్యమైన వాక్యము దూతలకివ్వవలసినదిగాని చీకటిగల భూమిమీద సంచరించుచున్న మాకు నీ వాక్యమిచ్చినావు నీకు స్తోత్రములు. మేము అనేకసార్లు మనోవిచారమువల్ల నిరాశవల్లను, అనేక రకముల చింతలవల్ల మా ముఖము నలుపుచేసికొనిన మాకు నీ వాక్యమిచ్చినావు తండ్రీ! నీకు స్తోత్రము. ఓ పరిశుద్ధాత్ముడవైన తండ్రీ! నీ వాక్యము వ్రాసి మాకిచ్చిరి. దానిని మేము ధ్యానించనైయుండగా తప్పుడు ఊహలు రానియ్యక మాలో ప్రతివారికి ఆదరణ సంతోషము అనుగ్రహించుము. మేము నీ వాక్యముపై భాగమునకు మాత్రమే గాక లోతైన అంతరంగ భావమును

మహిమనుగ్రహించే లోతైన అనుభవజ్ఞానమను గ్రహించుము. ఆమేన్.

1. ప్రభువు సిలువ శ్రమకు వెళ్ళకముందు మీరు గొర్రెలవలె చెదరిపోవుదురని, ప్రభువు తన శిష్యులతో ముందే చెప్పెను. ప్రభువు పట్టబడినప్పుడు ఇది నిజముగా నెరవేరినది. ప్రభువుమాట జ్ఞాపకము చేసికొని వారు బలము నిమిత్తము ప్రార్ధించి బెదరకుండా చెదరకుండా నుండవలసినది కాని, ప్రభువు ముందె ఎందుకు వారికీ సంగతి తెలియచేసెను? జాగ్రత్తగానుండుటకేగదా! మనకు మన కష్టములు తెలిసినప్పుడు మనము వెంటనే మోకరించి బలహీనతలు ఒప్పుకొని నివారణ ప్రార్ధనచేసి, స్తుతించి, కష్టమును తొలగింపచేసికొనవలెను.

2. పేతురు తప్పిపోవునని ప్రభువు ముందే తెలియజేసెను. మత్తయి 26:34 అప్పుడు పేతురు ఏమి చేయవలసియుండును? ప్రార్ధన చేయవలసినదే. మరియు కోర్టు గుమ్మము దగ్గర ప్రభువుయొక్క మాట జ్ఞాపకము చేసికొనవలసినది. చేసికొంటే ఎంత బాగుండును? ఒక భక్తుడిట్లు చెప్పెను. మొదటిమారు కోడికూసినప్పుడు కూత పేతురునకు వినబడకుండా దయ్యాలు డప్పులు వాయించినవి. ఎంత పరధ్యానము? ఇవన్నియు మనకు బోధనిమిత్తమై ముందే వ్రాయబడియున్నవి. పూర్వీకులకంటె మనము ఎంత జాగ్రత్తగా యుండవలెను. మీరు శోధనలోపడకుండునట్లు మెళుకువగలిగి జాగ్రత్తగా నుండుడి.

3. ఇంగ్లాండులో ఒక గొప్పదైవభక్తుడు ఉండెను. తన ప్రసంగమువల్ల అనేకమైన పాపులను ప్రభువుతట్టు త్రిప్పెనుగాని తుదకు ఏదో ఒక విషయములో నిరాశపడి బాత్‌రూమ్‌లోనికి వెళ్ళి

తలుపువేసికొని స్వహత్య చేసికొనెను అనే కథను విని నీవు జాగ్రత్తపడుము. ఓ సోదరుడా మెళుకువగా నుండు నీవు మేల్కొలుపు కలిగియుండు అజాగ్రత్తగాయుంటే, సోమరివైయుంటే, నిద్రమత్తు గలిగియుంటే పిశాచి నీ మీదపడదా?

4. ఒక భక్తురాలిని ఇద్దరు బోధింపరమ్మని పిలిచి పాప మార్గమున ప్రవేశపెట్టిరి. స్నేహితుడా! ఉషార్‌గానుండు (జాగ్రత్త గలిగి) సాతాను యొక్క తంత్రోపాయములును, మాయోపాయములను కనిపెట్టవలెను కదా! వీరు కీడు ఉద్దేశముగలవారైయున్నారని ఆమె గ్రహించక పోవడమువల్ల కనిపెట్టకపోవడమువల్ల స్వల్పనేరమే అయియుండదా? ఆమె బైలుదేరకముందు తాను ప్రార్థనచేసికొన్న యెడల ఆ పాపమార్గమునకు వెళ్ళకుండా ఆటంకము కల్గియుండునుగదా?

5. క్రీస్తుప్రభువు పరిశుద్ధాత్మను పొందిన తరువాత వెంటనే సాతాను శోధన ఆరంభమాయెను, గొప్పస్థితిలోనికి వెళ్ళిన తరువాత (పరిశీలించుట) శోధించుట అవసరమైయున్నది. ఎందుకంటే నీ గొప్పతనము ఒంటరిగానుంటేనే గొప్పతనమా? శోధనవచ్చేటప్పుడు ఉండేదో, ఊడేదో ఋజువు తెలుస్తుంది. ఉదా:- క్షయరోగులకు జ్వరము పూర్తిగా పోగానే నడవడానికి సెలవిస్తారు. రెండురోజులు నడచిన తర్వాత జ్వరము మరలా వచ్చిన యెడల ఆ ఆరోగ్యము స్థిరమైన ఆరోగ్యముకాదని గ్రహించుకొంటారు.

6. సూదంటురాయికి (Magnet అయస్కాంతము) సరిహద్దులో సూదిగాని, ఇనుపముక్క గాని, యున్నయెడల సూదంటు

రాయివైపు లాగబడును. ఎందుకంటే వాటిలో లాగబడే నైజమున్నది. మన హృదయములో నున్న చెడు నైజము పిశాచియొక్క శోధనకు త్వరగా లోబడిపోవును. అందుచేతనే మనము క్రీస్తునందు నూతనసృష్టియైయుండవలెను.

7. ప్రపంచమంతటన్ గ్రమ్ము పిశాచిలేమిచేయున్, మమ్మెల్ల మ్రింగ నున్నను మాకేల భీతివేయు? ఈలోకాధిపుడుగ్రుడైనను దానేమిచేయు? ॥మాకర్తగట్టి॥ ఇట్లు లూథర్ పాడెను. ఇట్లు శోధనకాలమందు ప్రతి క్రైస్తవుడు పాడవలెను.

8. యోసేపు శోధన తనయొద్దకు వచ్చినపుడు తాను ఆ శోధనకు లొంగిపోలేదు గాని ఆ శోధనయొద్దనుండి పారిపోయెను. ఇట్లే అందరు చేయవలెను. దావీదువలెనే గొప్ప ఆత్మీయమైన అనుభవము లేకపోయినప్పటికిని చిన్నపుడు నేర్చుకొన్న సంగతులను బట్టి యోసేపు బలముగలవాడై శోధనను జయించెను. యుద్ధములో ఒక దేశమును జయించిన రాజు కంటే యోసేపు వంటివాడే గొప్ప జయశాలి. స్నేహితుడా నీవు నీ నైజమును జయించుము. అప్పుడు నీవు యోసేపువలె సింహాసనాసీనుడవైయుందువు. యోసేపు పారిపోయెను గాని క్రీస్తుప్రభువు శోధన స్థలమునకు ఒంటరిగా వెళ్ళెను, జయించెను. ఇది మరింత చిత్రమైన కార్యము, ప్రభువు విషయములో నొకటి జ్ఞాపకముంచుకొనవలెను. ఆయన శోధన స్థలమునకు దైవాత్మచే నడిపింపబడెను. ఆయన నైజములో సూదంటురాయి ఎదుటనున్న వస్తువుయొక్క స్వభావము (అనగా పాపశోధనలవైపు లాగబడేట్టు) వంటి స్వభావములేదు. గనుక జయించెను. ముందు నైజమును మార్చుకొనవలెను. ఆలాగే మనలను

ఆత్మ నడిపించుకొని వెళ్ళితే వెళ్ళవచ్చును.

9. ఒకనిచ్చెన కలదు. దానికి 7 మెట్లుయున్నవి. ఒకడు చివరమెట్టుకు వెళ్ళిపడ్డాడు. దెబ్బతగలదా? ఎక్కువ స్థితిలోనికి వెళ్ళి పడకుండా జాగ్రత్తపడవలెను.

10. శోధనలు అనగా (ఎ) పాపములో పడవేసే శోధనలు (బి) నిందల శోధన (సి) వ్యాధి శోధన, ఈ మొదలైన శోధనలు వచ్చేటప్పుడు వాటినన్నిటిని జయించుటకు స్థిరముగా నిలువబడ వలెనుగాని చూచి బెదరకూడదు. ఇవి వచ్చునని ముందుగానే మనకు తెలియునుగదా పరలోకములోనుండి ఒక దరినుండి శక్తినిపొందుచు, ఒకదరినుండి శోధనలు జయించు చుండవలెను.

11. దావీదు దైవజనుడైయుండెను. ఆయన శోధన కాలమందు పాపముయొక్క సంగతి మరచిపోయియే ఉండెను. నాతాను ప్రవక్త వచ్చి ఉపమానముగా దావీదునకు పాపము జ్ఞాపకముచేసినప్పుడు అది జ్ఞాపకము వచ్చెను. ఆలాగుననే శోధనయుండును. కొందరు గొప్ప పాపములను గురించికూడా తలంపక ఏమియులేనట్లుగా నుందురు. స్నేహితుడా జాగ్రత్తగా నుండుము. మంచి మనస్సాక్షి కలిగియుండుము. పాపమువలన *మనస్సాక్షి కప్పియుండును. అప్పుడు మంచిచేయుటకు దానికి (మనస్సాక్షికి) శక్తియుండదు.*

12. సొలోమోను అన్నీ తెలిసినవాడైనను అన్యస్త్రీలను వివాహము చేసికొనెను. స్త్రీలయొక్క ప్రేరేపణచేత విగ్రహారాధన పాపములో పడెను. కాబట్టి ఇతరులయొక్క ప్రేరేపణలకు మనము ఒప్పుకొనకూడదు. ఎంతటివారైనను అనగా దావీదు, సొలొమోను

వంటి సజ్జనులైనను పడబోవుటకలదని జాగ్రత్త పడవలయును. ఈ వాక్యములను బాగుగా నలగ చదువుకొనవలెను. 2తిమోతి 2:15; 3:12-13; 2కొరింథి. 11:14; 1పేతురు 5:9; 1యోహాను 5:4; ఎఫెసీ 6:16; దా.కీర్తన 56:12.

13. షద్రక్, మేషక్, అబెద్నెగోలు ఏమిచెప్పియున్నారు. రెండు సంగతులు చెప్పిరి. (దాని. 3:17-18) 1) మా దేవుడు అగ్నిగుండమునుండి తప్పించుటకు సమర్థుడైయున్నాడు. 2) ఒకవేళ దేవుడు రక్షింపకపోయినను మేము విగ్రహారాధనచేయము. చూచినారా! వారియొక్క స్థిరవిశ్వాసము. అగ్నిగుండమువంటి శ్రమలు వచ్చినను, విశ్వాసము కదలకూడదు. శరీరము భస్మమైపోవచ్చును, కాని విశ్వాసము అగ్నికి తగులపడిపోదు.

14. బెల్జియము దేశములో గొప్ప యుద్ధకాలమందు ఒకభక్తిగల స్త్రీ గాయపడినవారికి సహాయము చేయుచుండెను. ఆమెను తుపాకితో కాల్చివేయుటకు శత్రువులు నిశ్చయించుకొనిరి. అప్పుడు ఆమె వారితో తాను ప్రభువు భోజనము పుచ్చుకొనేవరకునుండుడని చెప్పెను. తరువాత ఆమె ధైర్యముగా వారి నెదుట నిలువబడెను. కష్టములు, చిక్కులు, నష్టములు, అవమానములు తలంచకూడదు. ఇవన్ని వెనుకయుండును. భూకంపమువంటి కష్టములు వచ్చును. ముందుకు సాగిపోవలెను. శోధనలను శ్రమలను సహించుకొనువారెవరో నూతన యెరూషలేములో ఒక ఆభరణముగానుందురు.

*విశ్వాసి, శోధనకాలమిదియని, ఇది శోధనని గ్రహించే అందులోపడేకాలముగదా! అని తెలుసుకొని స్థిరముగా నిలువబడవలెను.*

# 13.8.44

**దాని. 12:4; మత్త. 24:33-35; 1కొరింథి. 1:21.**

**వాక్యము:- "దానియేలూ! నీవు ఈ మాటలను మరుగుచేసి అంత్యకాలమువరకు ఈ గ్రంథమును ముద్రింపుము. చాలమంది నలుదిశల సంచరించినందున తెలివి అధికమగును అని నాతో మాట్లాడు గబ్రియేలను నతడు చెప్పెను. " దాని. 12:4.**

దీనిని శ్రద్ధతో చదివిన అనేకులకు తెలివి అధికమగును. దానియేలు గ్రంథమును 12:4వచనము. దానియేలు గ్రంథమును క్రీస్తు పుట్టుకకుపూర్వము 534సం॥న వ్రాయబడెను. అనగా ఆ పుస్తకము వ్రాయబడి ఇప్పటికి సుమారు 2540సం॥లు అయినది. ఇప్పుడు ఆ గ్రంథమందున్న ప్రవచనము నెరవేరెను. ఈ ప్రవచనము అనగా జ్ఞానాభివృద్ధి ప్రవచనము, 18వ శతాబ్దములో పనిచేయ ప్రారంభమాయెను. జ్ఞానాభివృద్ధి రెండు భాగములు. 1) ఖగోళము లేక గోళము. వీటియందలి విషయములను తెలిసికొనుట ఇట్లు సృష్టియందలి విశేషములను తెలిసికొనుటకు, ప్రయత్నించుటలో

జ్ఞానాభివృద్ధి కనబడుచున్నది. 2) పరలోకము- అనగా పరలోకమందున్న దేవుడు, దేవదూతలు భూలోకము లేక గోళములపైనున్నదాని సంగతులు అనగా పరలోక సంగతులు తెలుసుకొనుట కష్టము.

దేవుడు ఈ విషయములు బైబిలుద్వారా తెలియజేయును. పరలోక సంగతులు తెలుసుకొనుటలోకూడ జ్ఞానాభివృద్ధి కలుగును. దానియేలు ఈ రెండు విషయములను గూర్చి వ్రాసెను. దానియేలు గ్రంథములో పూర్వ అధ్యాయములో క్రీస్తు పుట్టుకనుగూర్చి, రెండవ రాకడనుగూర్చి, రాజ్యకాలమునుగూర్చి, సంఘమునుగూర్చి, వెయ్యేండ్ల పరిపాలన మొదలగు విషయములను గూర్చి వ్రాయబడియున్నవి. ఈ దినము మనము చదివిన పాఠములో (1) శ్రమకాలము (2) సువార్తికులు నక్షత్రములవలె ప్రకాశించుట. (3) మిఖాయేలుదూత రాకడనుగూర్చి (4) శ్రద్ధగా చదివితే సంగతులు తెలిసికొందురనియు వ్రాయబడియున్నది. ఈ గ్రంథముయొక్క అర్థము యూదులకు వ్రాయబడినప్పుడు తెలియబడలేదు. ఇప్పుడు ముద్ర విప్పబడినందున బహిరంగముగ దీని అర్థము తెలియుచున్నది. పరలోక విషయములను తెలిసికొనుటలో మనకు జ్ఞానాభివృద్ధి కలుగుచున్నది.

భూగోళ, ఖగోళ విషయములనుగూర్చి తెలియజేయుటకు దేవుడు జ్ఞానులను లేపెను. పరలోక విషయములను తెలియజేయుటకు దేవుడు విశ్వాసులను లేపెను. వీరందరిపైన దేవుడున్నాడు. పరలోక సంగతులు, బైబిలునుగూర్చిన విషయములను మొదటి శతాబ్దము నుండి ఇప్పటివరకు వ్రాయుచునేయున్నారు. 15వ శతాబ్దములో మార్టిన్ లూథరు, 14వ శతాబ్దములో అగస్టీను; ఈ విధముగా అనేకమంది భక్తులు అనేక విషయములనుగూర్చి వ్రాయుచున్నారు. ఇంకా వేల సంగతులున్నవి. పూర్వ కాలమునాటి కొందరు భక్తులు వారి జ్ఞానమునుబట్టి పుస్తకములు వ్రాసిరి. ఈ కాలపు భక్తులు జ్ఞానమును పూర్తిగా వదలి పరిశుద్ధాత్మ చెప్పినట్లు వ్రాయుచున్నారు. ప్రకటన

గ్రంథమును యోహానుగారు పరిశుద్ధాత్మ శక్తిద్వారా వ్రాసెను. అలాగే ఈ కాలమందలి కొందరు భక్తులద్వారా దేవుడు వ్రాయించుచున్నారు. తెలివి, విశ్వాసము వృద్ధియైనవి. క్రైస్తవ మతములో క్రొత్త సంగతులకు కొదువలేదు. ఇండియా దేశములో శిరంపూర్‌లో ఉన్న కాలేజిలో బైబిలుమీద అనేక పుస్తకములు వ్రాయబడియున్నవి. ప్రపంచమంతటిలో పెద్ద పుస్తక భాండాగారం అమెరికాలోని "చికాగో" అనే గొప్ప పట్టణములో ఉన్నది. ఇచ్చట లోకజ్ఞానమునుగూర్చియు, పరలోక విషయములను గూర్చియు చాలా పుస్తకములున్నవి. దేవుడు అనేక భక్తులకు 1వ శతాబ్దము నుండి 20వ శతాబ్దము వరకు కొన్ని సంగతులు బైలుపర్చెను, కాని అందరికి అవి బైలుపర్చలేదు. రాకడ దగ్గరైనందున ఇప్పుడు భక్తులు అడిగినప్పుడెల్ల ప్రతిరోజును బైలుపర్చుచున్నారు. బైబిలులోని 66 పుస్తకములమీద వ్యాఖ్యానములు, ప్రసంగములు బైబిలులోని ఒక్కొక్క కథను ఒక్కొక్క పుస్తకముగాను వ్రాసిరి.

దానియేలు ప్రవచనము ఎంత సత్యము! రాను రాను క్రొత్త సంగతులు బైలుపడుచున్నవి. ఇతర దేశస్థులు ఏదైనా మంచి సంగతులు బైలుపర్చునప్పుడు వెంటనే పుస్తకములో వ్రాయుచుందురు. మన దేశస్థులకు ఈ అలవాటులేదు. దేవుడు ఏ మంచి సంగతి (బయలుపరచి) చేసినను వ్రాయవలెను. దానియేలు 12:1-4వరకు ఉన్న మాటలకు అర్ధములు **మిఖాయేలు:-** ఈయన ప్రధాన దూతలలో ఒకదూత. మోషే శవమునుగూర్చి సాతానుతో వాదించెనని యూదా పత్రికలో ఉన్నది. సాతానుతో యుద్ధము చేసెనని ప్రకటనలో యున్నది. ఈయన దైవజనుల పక్షముగా గొప్ప పనిచేయువాడై యున్నాడు. సమయము వచ్చినప్పుడు దూతలందరు దైవజనుల పక్షముగా పనిచేయుదురు.

**ఆదపః:-** ఇది పెండ్లికుమార్తె ఆరోహణమైన తరువాత భూమిమీద కలుగనైయున్న శ్రమకాలము. జీవగ్రంథములో ఎవరి పేరు

వ్రాయబడెనో వారు శ్రమ తప్పించుకొందురు. సమాధులలో నుండి లేచువారు అంత్యతీర్పునాడు నిత్యనాశనమునకు వెళ్ళువారు లేతురు. మొదటి పునరుత్థానమునందు లేచువారు నిత్యజీవమునకు లేతురు.

**అనేకులను త్రిప్పువారు:-** రాకడవరకును సువార్త చెప్పి అనేకులను ప్రభువుతట్టు త్రిప్పువారు ప్రకాశింతురు.

**మరుగుచేయుట:-** మనము నివసించుచున్న ఈ కాలమువరకు అనేక విషయములు ఇప్పుడు బైలుపడుచున్నవి. ప్రకటనను చదువువారు దానియేలు గ్రంథమును బైబిలుఅంతయును సులభముగా అర్ధము చేసికొనగలరు. అలాగే పరమగీతార్ధము తెలిసినవారు అనేక నూతన సంగతులు తెలిసికొందురు.

**అనేకులు:-** దానియేలు గ్రంథము విశ్వాసులందరును చదువుచూనేయున్నారు. అందరికి మర్మములు చెప్పబడవు, విప్పబడవు. ఏర్పర్చబడినవారికే విప్పబడును, వారనేకులు ఉందురు. ఒకరికి బైలుపర్చబడిన సంగతి మరియొకరికి బైలుపడదు. యోహానుకు బైలుపడిన సంగతులు తత్పూర్వము భక్తులకు బైలుపడలేదు. తర్వాత బైలుపడినవారు అందరు అనేకులైయున్నారు. ఎలాగనగా వ్యాఖ్యాన గ్రంథములు తెలియుటవల్ల ఈ సంగతి అందరకు తెలిసినదని మనకు బోధ పడగలదు.

ఇంగ్లీషు బైబిలులో చివరికాలమందు ప్రజలు భూమిచుట్టు తిరుగుదురు అని వ్రాయబడియున్నది. అది కొన్ని ప్రాచీన ప్రతులలో లేనందున తెలుగు బైబిలులో ఈలాగు వ్రాయబడినది- తెలివి అధికమౌటయు, అన్ని ప్రదేశములకు వెళ్ళుటయు మన కాలములోనే చూచుచున్నాము. కాబట్టి దానియేలు ప్రవచించిన కడవరి కాలము మన కాలము అని గ్రహించుచుండుము. ట్రైన్‌లు, స్టీమర్లు, ఓడలు, గాలి విమానములు ఈ కాలములోనే విశేషముగా ఉన్నందువలన ఈ ప్రవచనము నెరవేరుచున్నది. మరియుసృష్టినంతటిని పరీక్షించి జ్ఞానులు వ్రాసిన పుస్తకములుకూడ ఉపయోగమే అవి ఏమనగా

గుంటూరు నందు:

ప్రథమ ముద్రణ 2006 ప్రతులు 5000

ఇది దేవుడు యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన

## బైబిలు మిషను ప్రచురణ

బైబిలు మిషను ప్రెస్ - పెదకాకాని, 522 509.

ఫోన్ : 2556644; 2556149.